

విజ్ఞానాలయాలు.. వెలవెల

విజ్ఞానాలయాలుగా విలసిల్లుతున్న గ్రంథాలయాలు.. నిధులు రాక, నిర్వహణ లేక విలవిలలాడుతున్నాయి. వివిధ రకాల గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు లేక, పాఠకుల ఆదరణ కోల్పోయి వెలవెలపోతున్నాయి. వందలాది మంది పాఠకులతో కళకళలాడే గ్రంథాలయాలు నేడు కునారిల్లిపోతున్నాయి. నిధుల కొరతతో.. మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరణకు నోచుకోలేక గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న లైబ్రరీలు గత వైభవం కోసం ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగార్థులకు కావాల్సిన పుస్తకాలను అందించడంతో పాటు జ్ఞాన సముపార్జనకు వచ్చే పలువురికి అరకొర సౌకర్యాలే స్వాగతం పలుకుతుండడంతో గ్రంథాలయాలకు వచ్చేవారి సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. గడచిన ఐదేళ్లలో ఒక్క పుస్తకం కొనుగోలుకు కానీ, భవనాల మరమ్మతులకు కానీ ఒక్క రూపాయి వెచ్చించలేదంటే గ్రంథాలయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఏరీతిన ఉందో తెలుసుకోవచ్చు. స్థానిక సంస్థల నుంచి హక్కుగా రావాల్సిన సెస్సు కూడా ఏళ్ల తరబడి జమ కాకపోవడంతో కోట్ల రూపాయలు బకాయిలు వెక్కిరిస్తున్నాయి. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పాఠకుల కోసం గ్రంథాలయాల సమస్యలపై ప్రత్యేక కథనం.

ఆధునికతకు.. ఆపసోపాలు

అవే పత్రికలు, పుస్తకాలు తప్ప డిజిటలైజేషన్ వైపు పకడ్బందీగా అడుగులు వేయలేక గ్రంథాలయాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఇంటర్నెట్ వినియోగం పెరిగిపోతున్న తరుణంలో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అయితే ఇందుకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. గ్రేడ్-1, 12 గ్రేడ్-2 శాఖా గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలని గతంలో అధికారులు సంకల్పించగా ఆ ప్రయత్నం ముందుకు సాగడంలేదు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 20 కంప్యూటర్లతో ఎయిర్ కండీషనింగ్ చేయించినా పాఠకులకు ఉచిత సేవలు అరకొరగానే లభిస్తున్నాయి.



రేపల్లె: పాఠకులు లేక వెలవెలబోతున్న గ్రంథాలయం

ఆదర్శంగా వినుకొండ

2007వ సంవత్సరం నుంచి మొదలుకొని పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ మున్సిపాలిటీ క్రమం తప్పకుండా సెస్సు చెల్లిస్తున్నది. రూ.1.63 కోట్ల గ్రంథాలయ సెస్సుకు మొత్తం డిమాండ్ చెల్లించింది. వినుకొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీసుకుని సెస్సు బకాయిలు లేకుండా అన్ని పురపాలక సంఘాలు, పంచాయతీలు, ఏపీఐఐసీ చెల్లిస్తే పాఠకులకు అధునాతన సౌకర్యాలను గ్రంథాలయాల్లో కల్పించొచ్చు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో గ్రంథాలయాలు కునారిల్లిపోయాయి.





(ఆంధ్రజ్యోతి - బాపట్ల, న్యూస్‌నెట్‌వర్క్)

పలు దినపత్రికలు, గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు.. వాటిని చదువుకునేందుకు వచ్చే పాఠకులతో గ్రంథాలయాలు కళకళలాడుతుండేవి. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిలో గ్రంథాలయాలకు పెద్ద ఆదరణ ఉండేది. ప్రభుత్వంతో పాటు గ్రంథకర్తలు, సాహితా సంస్థల ప్రోత్సాహంతో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లేవి. ఎందరికో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు రావడానికి కారణమయ్యాయి. అలానే సాహితీవేత్తలను తయారు చేశాయి. అలాంటి గ్రంథాలయాలు గత కొంతకాలంగా నిధులు లేక, పలు రకాల సమస్యలను పరిష్కరించే దిక్కు లేక, ఎవరికీ పట్టనట్లుగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు గ్రంథాయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రభుత్వం గ్రంథాలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోగా ప్రజల నుంచి వసూలు చేస్తున్న సెస్సులను స్థానిక సంస్థలు దారి మళ్లిస్తున్నా పట్టించుకోవడంలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ గ్రంథాలయాలకు జమ చేయకుండా జాప్యం చేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ విధానం కారణంగా కనీసం స్టేషనరీ సామాగ్రిని కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 97 శాఖా గ్రంథాయాలు, 32 గ్రామీణ, 103 పుస్తక పంపిణీ కేంద్రాలున్నాయి. ఆయా గ్రంథాలయాల్లో 10,52,370 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 51,862 పుస్తకాలు ఉండగా వాటిలో చాలావరకు కాలం చెల్లినవే. అప్‌డేట్ అయినవి చాలా తక్కువగా ఉన్నాయి. వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అవసరం మేరకు అందుబాటులో లేవు. రీడర్స్ ఆన్ డిమాండ్ పుస్తకాలను తెప్పించడంలో జాప్యం జరుగుతున్నది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కటంటే ఒక్క పుస్తకం కొత్తగా కొని పాఠకులకు అందుబాటులో ఉంచలేదు. డీఎస్సీ, టెట్, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఉద్యోగార్థులకు కావాల్సిన ఏ ఒక్క మెటీరియల్ కూడా గ్రంథాలయాల్లో అందుబాటులో లేదు. గ్రంథాలయాల్లో భర్తీ కావాల్సిన పోస్టులు అయితే పదుల సంఖ్యలోనే ఉన్నాయి. చాలా చోట్ల అవుట్ సోర్సింగ్ విధానంతోనే నడిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా గ్రంథాలయాలను గాడిన పెట్టే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు బకాయిల వసూలుపై దృష్టి పెట్టి ఆ నిధులను వాటి అభివృద్ధిపై ఖర్చు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతుండడంతో ఆర్భాటపు ప్రకటనలకే పరిమితం కాకుండా అమలు జరిగే పనులకు పూచీ ఇచ్చి వాటిని ఆచరణలోకి తేవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సెస్సుల జమలో నిర్లక్ష్యం

ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో 8 శాతం సెస్సు కింద ఎక్కడికక్కడ ఉండే గ్రంథాలయాల ఖాతాల్లో జమ చేయాలి. ఈ నిధుల్ని గ్రంథాలయాల అభివృద్ధికి మాత్రమే వెచ్చించాలని నిబంధనలున్నాయి. గడచిన ఐదేళ్లలో సెస్సు మొత్తాలను లైబ్రరీ ఖాతాలకు జమ చేయకపోగా ఆ నిధులను దారి మళ్లించేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పురపాలకసంఘాలు, పంచాయతీలు, కార్పొరేషన్‌లు, ఏపీఐఐసీ నుంచి గ్రంథాలయాలకు సెస్సు బకాయిలు రావాలి. 2007-08 నుంచి రూ.42 కోట్ల పైచిలుకు సెస్సు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్పొరేషన్ల నుంచి రూ.8.08 కోట్లు, మున్సిపాలిటీల నుంచి రూ.3.97 కోట్లు, పంచాయతీల ద్వారా రూ.3.16 కోట్లు, ఏపీఐఐసీ నుంచి రూ.75,90,733 కలిపి మొత్తంగా రూ.15 కోట్ల 99 కోట్ల సెస్సు రావాలి. అయితే ఇప్పటివరకు రూ.9.02 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.6.96 కోట్లు వసూలు కావాల్సి ఉన్నది. బాపట్ల పురపాలక సంఘం నుంచి రూ.30.44 లక్షల బకాయి రావాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. చిలకలూరిపేట నుంచి రూ.37.63 లక్షలు, మాచర్ల నుంచి రూ.19.11 లక్షలు, పిడుగురాళ్ల నుంచి రూ.29.18 లక్షలు, గురజాల నుంచి రూ.4.43 లక్షలు, దాచేపల్లి నుంచి రూ.8.48 లక్షల్లో రూపాయి కూడా వసూలు జరగలేదు. 1017 పంచాయతీల్లో రూ.3.16 కోట్లు డిమాండ్ ఉంటే అందులో సగం మాత్రమే జమైంది. ఏపీఐఐసీ నుంచి రూ.75.90 లక్షలు రావాల్సి ఉండగా ఒక్క రూపాయి విడుదల కాలేదు. ఇలా సెస్సు బకాయిలు పేరుకుపోతుండటంతో గ్రంథాలయాల నిర్వహణపై భారం పడుతున్నది.



శంకుస్థాపనతో సరి..

బాపట్ల: బాపట్ల జిల్లా ఏర్పడి రెండేళ్లు దాటినా బాపట్లకు శాఖా గ్రంథాలయమే దిక్కయింది. అది కూడా శిథిలావస్థలో ఉన్న భవనంలో సాగుతుంది. బాపట్ల జిల్లాగా ఆవిర్భవించిన తొలినాళ్లలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపనతో సరిపెట్టారు. ఆరుదశాబ్దాల ఘనచరిత్ర కలిగిన బాపట్లశాఖా గ్రంథాలయం నేటికి అద్దెభవనంలోనే కునారిల్లుతున్నది. 26వేల పుస్తకాలు ఉన్నా అద్దె భవనంలోనే కొనసాగుతున్నది. గ్రంథాలయ విశిష్టత, అవసరత తెలిసిన వారుకూడా సొంతతభవన నిర్మాణానికి కృషి చేయలేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గాదె వెంకటరెడ్డి కృషితో ఆంజనేయ అగ్రహారం స్కూల్ ప్రాంగణంలో 8 సెంట్లు కేటాయించి శంకుస్థాపన చేశారు. కాని నిధుల కొరతతో భవన నిర్మాణం జరగలేదు. బాపట్ల శాఖా గ్రంథాలయం సెస్సు బకాయి సుమారు రూ.1.50 కోట్లు ఉంది. జిల్లాలోని రేపల్లె, బాపట్ల, చీరాల మున్సిపాలిటీల పరిధిలో రూ.1.66 కోట్లు సెస్సు బకాయిలు ఉండగా, పంచాయతీల పరిధిలో రూ.3.12 కోట్ల బకాయిలు ఉన్నాయి. జిల్లాలో 35 ఖాళీలను అధికారులు గుర్తించారు.



స్థలం ఉన్నా నిర్మాణంలో జాప్యం

రేపల్లె: పట్టణంలోని చంద్రమౌళిపార్కులో 1960లో ఏర్పాటు చేసిన గ్రంథాలయ భవనం శిథిలమై కూలిపోగా ఇప్పటికీ నూతన భవన నిర్మానం జరగలేదు. ఎంతో ఘన చరిత్ర కలిగిన గ్రంథాలయ భవనం కనుమరుగైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు దాసరి కృష్ణకుమారి కాంప్లెక్స్ భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చారు. నూతన భవన నిర్మాణానికి పరుచూరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పరుచూరి శ్రీనాథ్ రూ.20 లక్షలు సమకూరుస్తామని హామీ ఇచ్చినా దానిని సద్వినియోగం చేసుకోలేదు. గ్రంథాలయంలో కొత్తపుస్తకాలు వచ్చిన దాఖలాలులేవు. పక్కాభవనం లేకపోవడంతో సరైన సంరక్షణ లేకపోవడంతో పుస్తకాలు పాడైపోయాయి. సెస్ బకాయిలు రూ.30 లక్షల వరకు ఉంది.



వసతులు అంతంత మాత్రమే

నరసరావుపేట: నరసరావుపేటలోని శాఖా గ్రంథాలయంలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్ల వసతి లేదు. ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించలేదు. పాత పల్నాడు బస్టాండ్‌లోని గ్రంథాలయ భవనానికి అద్దెల ఆదాయం సమకూరుతుంది. అయితే సౌకర్యాలు సక్రమంగా లేవు.

- ఆదరణ లేక గ్రంథాలయాలు వెలవెల
- ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
- అరకొర పుస్తకాలతోనే పరిమితంగా సేవలు
- లైబ్రరీలకు సెస్సులు చెల్లించని స్థానిక సంస్థలు
- కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం రావాలని ఆశ

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

- 'తేమ' పరీక్షలో చిత్తవుతున్న పత్తి రైతు
- అమ్మకాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- తిరస్కరించిన లోడ్‌ను తిరిగి తీసుకెళ్లడం అదనపు భారం



పత్తిలో తేమ శాతం చూస్తున్న అధికారులు



గుంటూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులు.. సీసీఐ నిబంధనలు.. పత్తిని అమ్ముకునే రైతులకు అగ్నిపరీక్షలుగా మారుతున్నాయి. మద్దతు ధర దక్కుతుందనుకున్న సీసీఐ కేంద్రాల్లో చిత్ర, విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఎండ వేడి ఎక్కువగా ఉన్న ఉదయం వేళ తీసుకువస్తున్న పత్తి లాట్‌లు సీసీఐ తేమ పరీక్షలో నెగ్గుతున్నాయి. సాయంత్రం తీసుకువస్తున్న పత్తి లాట్లలో తేమ శాతం నిబంధనలకు మించి ఉండటంతో తిరస్కరిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో పత్తి కొనుగోలు కోసం రైతులు ఒకటి, రెండు రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంటోంది. అప్పటికీ కూడా తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొనుగోలు చేయకపోతుండటంతో ఉసూరుమంటూ వెళ్లిపోతున్నారు.

యంత్రాల్లో తేడా...

ప్రస్తుతం సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం చూసేందుకు బయ్యర్లు రెండు రకాల యంత్రాలు వినియోగిస్తున్నారు. వాటిలో ఒక్కో దానిలో ఒక్కో తేమ శాతం కనిపిస్తుంది. చిన్న ముళ్ళు ఉన్న యంత్రంలో 12 శాతం తేమ ఉన్నట్లు చూపిస్తుంటే, పెద్ద ముళ్లు ఉన్న యంత్రంలో 15 శాతం ఉన్నట్లు

(మిగతా 6లో)

4 కార్పొరేషన్లు.. పదవులు
ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరికొందరికి అందలం 8

అభాగ్యులకు.. ఆసరా
◆ మిషన్ వాత్సల్యలో 318 మందికి లబ్ధి
◆ రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
◆ దరఖాస్తులతో సరిపెట్టిన గత వైసీపీ పాలకులు

80 శాతం దరఖాస్తుల పరిష్కారం
నేటి సాయంత్రానికి పట్టభద్రుల ఓటరు ముసాయిదా జాబితా

శబరిమలకు ప్రత్యేక రైళ్లు
యాత్రికుల సౌకర్యార్థం ఈ నెల 25 నుంచి

రేషన్ ముఠాలో రెంటచింతల బియ్యం వ్యాపారి
నల్గొండలో పోలీసుల అరెస్టు

22 నుంచి డీఆర్ఎం కప్ టోర్నమెంట్
నల్లపాడులోని రైల్‌విహార్ గ్రౌండ్‌లో నిర్వహణకు ఏర్పాట్లు 6

సంక్షేమ పథకాల సత్వర అమలుకు ప్రణాళికలు సిద్ధం

● ఏపీ మాదిగ సంక్షేమ కో ఆపరేటివ్ ఫైనాన్స్ సంస్థ ఛైర్ పర్సన్ శ్రీదేవి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి


గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో షెడ్యూల్ కులాల సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధుల్లో సంక్షేమ పథకాలు సత్వర అమలు కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ఛైర్‌పర్సన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. తాడేపల్లిలోని కార్యాలయంలో మంగళవారం సంస్థ సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ సిబ్బంది అంకిత భావంతో పని చేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సంక్షేమ పథకాల అమల్లో నిర్లక్ష్యం చేస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కే కృష్ణవేణి, కార్యనిర్వహణ అధికారులు మంగారావు, కామేశ్వరరావు, ప్రసాద్ ఉన్నారు.

వైసీపీలో ఇంకా మార్పు రాలేదు: కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీని 11 సీట్లుకే పరిమితం చేసినప్పటికీ వారి వైఖరిలో ఎటువంటి మార్పు రాలేదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వృద్ధిరేటులో కూటమి ప్రభుత్వం కంటే జగన్ ప్రభుత్వంలోనే ఎక్కువగా ఉందన్న అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. వృద్ధిరేటు పెరగాలంటే కొత్తగా పరిశ్రమలు తీసుకువచ్చి ఆదాయ మార్గాలను పెంపొందించాలని, వైపీపీ హయాంలో కొత్తగా తీసుకు వచ్చిన పరిశ్రమలు ఏం ఉన్నాయో చెప్పాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను, ఐటీ కంపెనీలను పంపించి వేసినందుకా వృద్ధిరేటు పెరిగిందని ఎద్దేవా చేశారు.

నదుల అనుసంధానంతో రాష్ట్రం సస్యశ్యామలం

● పోలవరం, జలవనరుల ప్రాజెక్టులపై అసెంబ్లీలో మాట్లాడిన చీఫ్ విప్ జీవీ


అసెంబ్లీలో మాట్లాడుతున్న జీవి ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టును నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామల చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, కరువు రహితంగా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ పోలవరం ప్రాజెక్టును, వినుకొండ ప్రాంతానికి కీలకమైన బొల్లాపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తుందని అన్నారు. గోదావరి, పెన్న నదుల అనుసంధానంతో గుంటూరు, ప్రకాశం, రాయలసీమను సస్యశ్యామలం అవుతాయని అన్నారు. గడచిన ఐదేళ్లలో జగన్‌రెడ్డి చేసినంత ద్రోహం రైతులకు ఎవరు చేయలేదని, 2014-2019 మధ్య మొత్తం రూ.7లక్షల కోట్ల బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ.68293 కోట్లు ఇచ్చి 62 ప్రాజెక్టులకు పనులు మొదలు పెట్టారన్నారు. అందులో 23 ప్రాజెక్టులు పూర్తి చేసిన ఘనత కూడా నాడు చంద్రబాబునాయుడుకే దక్కిందని అన్నారు. తద్వారా 32 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తీసుకురావడం జరిగిందని చెప్పారు. జగన్ హయాంలో సాగునీటికి కేవలం రూ.34 వేల కోట్లు ఖర్చు చేశారని, అందులో జీతాలకే రూ.10 వేల కోట్లు పోయాయన్నారు. దీని ఫలితంగానే రాష్ట్రంలో సాగునీటి రంగం అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రివర్స్ టెండరింగ్ పేరుతో సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 71 శాతం ప్రాజెక్టులను పూర్తిచేస్తే జగన్ తనహయాంలో కేవలం 4.8 శాతం మాత్రమే చేయగలిగారని విమర్శించారు. జగన్ అధికారంలోకి రాకుండా ఉన్న ట్లయితే 2020-21 కే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. 2014-19 బడ్జెట్‌లో సాగునీటికి 9.7 శాతం ఇస్తే జగన్ 2.7 శాతం మాత్రమే ఖర్చు చేశారని, రాయలసీమ కోసం టీడీపీ ప్రభుత్వం రూ.12,441 కోట్లు ఖర్చుపెడితే నాడు జగన్ ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లు ఖర్చు చేసిందని, అది రాయలసీమకు ద్రోహం కాదా అని ప్రశ్నించారు. ఇదే సమయంలో జగన్ ప్రభుత్వంలో 450 ఎత్తి పోతల పథకాలు మూలనపడ్డాయని విమర్శించారు. ట్రాన్స్‌ఫార్మర్లు పోయినా, మోటార్లు రిపేర్లు వచ్చినా, గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు.

పంటల బీమాతో ధీమాగా ఉండొచ్చు

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



గుంటూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలు చేతికి వచ్చే వరకు 'నో గ్యారెంటీ..నో వారంటీ' అన్న రీతిలో ఉంటున్నాయి. వాతా వరణంలో సంభ విస్తున్న మార్పులు వల్ల పెట్టుబడులు పెట్టిన అన్నదాత ఎక్కువ సార్లు నష్టపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి రైతులను తప్పించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునఃసంస్థాపిత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం ప్రవేశపెట్టాయి. వాటి వివరాలు పూర్తిగా తెలుసుకునేందుకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లుతో 'ఆంధ్ర జ్యోతి' ఫటా ఫట్..



పంట బీమా ప్రయోజనం ఏమిటి?

అధికారి: అతితక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ధి చేకూర్చే ప్రక్రియ ఇది. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు వెన్నుదన్నుగా ఉండే అవకాశం ఉంటుంది. కేవలం రైతు ప్రయోజనం అంతా పంటల బీమాపై ఆధారపడి ఉంటుంది.

ఏ ఏ పంటలకు భీమా వర్తిస్తుంది..

అధికారి: ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన,పునఃసంస్థాపిత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద లబ్ధి పొందేందుకు కొన్ని పంటలను గుర్తించాం. మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర,పప్పు శెనగ పంటలకు ఈ బీమా వర్తిస్తుంది.

ఏ పంటకు ఎంత బీమా ప్రీమియం చెల్లించాలి?

అధికారి: ఎకరా మొక్కజొన్నకు రూ.114, జొన్నకు రూ.48, మినుముకు రూ.50, పెసరకు రూ.45, పప్పుశెనగకు రూ.70 చొప్పున చెల్లించాలి.

బీమా చెల్లించేందుకు ఎప్పటి వరకు గడువు ఉంది?

అధికారి: పంటల బీమాలో చేరేందుకు డిసెంబర్ 15 వరకు గడువు ఉంది. రైతులు అశ్రద్ధ చేయకుండా ఈ పథకంలో, ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి.

నమోదు ప్రక్రియలో ముఖ్యమైన విషయాలు ఏమిటి..

అధికారి: బ్యాంకు ద్వారా రుణాలు పొందిన రైతులకు ఆటోమ్యాటిక్‌గా బీమా సొమ్ము కట్ అవుతుంది. రుణాలు పొందని రైతులు స్వయంగా సమీప కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి స్పాట్ నమోదు చేయించుకోవాలి. అందుకోసం ఆధార్ కార్డు,లీజు ఒప్పందం (కౌలు రైతులకు) పంట సాగు విస్తీర్ణ సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్ వివరాలు తీసుకొని వెళ్ళాలి. పంట సాగు సర్టిఫికెట్ ను గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్, గ్రామ హార్టికల్చరల్ అసిస్టెంట్, రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జి ద్వారా జారీ చేస్తారు. రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లో ఇచ్చిన రశీదు ప్రకారం సరిగ్గా ప్రీమియం చెల్లించాలి.

సబ్ జూనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా ఎడ్ల జతకు ప్రథమ స్థానం

● హోరాహోరీగా ఎడ్లబండ లాగుడు పోటీలు


ప్రథమస్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా ఎడ్ల జత

దుర్గి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో నంద్యాల జిలా పాణ్యం మండలంలోని ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మేశ్వరరెడ్డి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని ధర్మవరంలో శ్రీహరిహర బాలనాగేంద్ర స్వామి వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల జత నిర్ణీత వ్యవధిలో 4142.9 అడుగుల దూరం లాగింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సాకేత్‌రెడ్డి, సారికరెడ్డి ఎడ్ల జత 3660 అడుగులు లాగి రెండోస్థానంలో, ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని గంగన్నపాలెంకు చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్ల జత 3502.10 అడుగులు లాగి మూడోస్థానంలో, పల్నాడు జిల్లా నాదెండ్లకు చెందిన దేవభక్తుని శ్రీకాంత్‌చౌదరి ఎడ్లజత 3500 అడుగులు లాగి నాలుగో స్థానంలో, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత 3446.5 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డిలు వ్యవహరించారు. సేద్యం విభాగంలో బుధవారం పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలుత జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లుతో కలిసి మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఈ పోటీ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్ల పోటీలు పశుపోషకులకు పండుగ లాంటిదని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో ఉత్సాహంగా రైతులు తరలివచ్చి ఆసక్తిగా పోటీలను తిలకించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రశాంత వాతావరణంలో పోటీలు జరుపుకోవడం శుభసూచికమన్నారు. 2019 సంవత్సరంలో ఇదే వార్షికోత్సవాల్లో జనసేన నేతలు జనసేన పార్టీ జెండా ఊపారనే అక్కసుతో వారిపై వైసీపీ నేతలు దాడి చేయడంతోపాటు కేసులు నమోదు చేసి అప్పటి నుంచి వేరే రాజకీయ పార్టీ నేతలను వేడుకల్లో పాల్గొనకుండా చేశారని చేశారన్నారు. ప్రస్తుతం ఎటువంటి కక్ష సాధింపులు లేకుండా అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు సమాజ శ్రేయస్సు కోసం శ్రమిస్తున్నారన్నారు. జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ నేతలు ఎన్నో ఒత్తిళ్లకు ఎదురొడ్డి నిలబడిన ధర్మవరం జనసైనికులు అందరికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వర్లును కూటమి నేతలు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, పులి హరి, పంగులూరి అంజయ్య, యేచూరి సునీతాశంకర్, బూసా రామాంజినేయులు, కటకం అంకారావు, చిరుమామిళ్ల కృష్ణయ్య, దిగుమర్తి సుబ్బారావ, ఆకుల లక్ష్మణ, రుద్రాల రవి, కటకం రామారావు, గుండాల వెంకటేశ్వర్లు, తక్కెళ్లపాటి వెంకటేశ్వర్లు, ధారా రాఘవరావు, యాగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


డీఆర్‌ఎం కప్ టోర్నమెంట్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ, ఇతర అధికారులు

22 నుంచి డీఆర్‌ఎం కప్ టోర్నమెంట్

● రెండో ఎడిషన్ ప్రారంభిస్తాం

● గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌ఎం కప్ రెండో ఎడిషన్ ఈ నెల 22 నుంచి ప్రారంభంకానున్నట్లు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మిం టన్, బాస్కెట్ బాల్ క్రీడల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో టోర్నమెంట్ వివరాలను డీఆర్‌ఎం మంగళవారం మీడియాకు వివరించారు. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల మధ్యన స్నేహపూర్వక వాతావరణం, సమన్వయం తీసుకొచ్చే లక్ష్యంతో తాము గత ఏడాది ప్రథమంగా డీఆర్‌ఎం కప్ ఫస్టు ఎడిషన్ ప్రారంభించామన్నారు. దీనికి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. ఆ స్ఫూర్తితో ఈ ఏడాది సెకండ్ ఎడిషన్‌ని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది సెకండ్ ఎడిషన్‌ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీలు ఈ నెల 22, 23, 24, 29, 30, డిసెంబరు 1న నల్లపాడులోని రైల్‌విహార్ గ్రౌండ్స్‌లో జరుగుతాయని, విజేతలకు రూ. 75 వేలు, రన్నర్స్‌కు రూ. 50 వేల నగదును అందజేస్తామని వివరించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు ఈ నెల 22, 23, 24 తేదీల్లో డీఆర్‌ఎం ఆఫీసు కాం పౌండ్‌లోని ఆటస్థలాల్లో జరుగుతాయని, వీటిల్లో విజేతలకు రూ. 15 వేలు, రన్నర్స్‌కి రూ.7 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 3 వేలు అందజేస్తామని వివరించారు. ఈ నెల 20 సాయంత్రం వరకు ఎంట్రీలు పంపవచ్చని తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, ప్రకాశం, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా లకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ టోర్నమెంట్ పాల్గొనవచ్చని సూచించారు. వివరాలకు సీహెచ్ విజయకుమార్ (9701379911), వై శ్రీనివాసరావు (9347785888) ఆయా నంబర్లలో సంప్రదించాలని సూచిం చారు. సమావేశంలో ఏడీఆర్‌ఎం కేసైమన్, సీనియర్ డీవోఎం ఎం దినేష్ కుమార్, సీనియర్ అధికారులు షాబాజ్ హనూర్, ప్రదీప్‌కుమార్, విజయకీర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(విద్య),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం మంగళగిరిలోని వీవర్స్‌కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా యార్లగడ్డ శ్రీనివాసరావు, కార్యదర్శిగా చుక్కా కొండయ్య, కోశాధికారిగా గంగాధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అశోక్‌బాబు ఎన్నికయ్యారు. నూతన కమిటీ నాయకులు సోమవారం డీఈవో సీవీ రేణు కను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో క్రమశిక్షణతోపాటు, క్రీడాభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని డీఈవో సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

39,948 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,356 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 39,948 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 31,944 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14000	334	9800	14000
నెంబరు. 5	9000	11500	నెంబరు. 5	-	-
273	10000	12000	273	-	-
341	8000	15500	341	9000	14500
4884	-	-	4884	14000	14000
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	17000	తేజ	9500	16000
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	9000	12800
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9500	14500
తెల్లకాయలు	4500	10500	తెల్లకాయలు	5000	10000

జేకేసీ కళాశాలలో నూతన ఆడిటోరియంను నేడు ప్రారంభించినున్న డీజీపీ


జేకేసీకళాశాలలో నిర్మించిన నూతన ఆడిటోరియం

గుంటూరు(విద్య),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిజిపి సిహెచ్ ద్వారక తిరుమలరావు బుధవారం నగరానికి రానున్నారు. బుధవారంసాయంత్రం 5 గంటలకు జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి పేరుతో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని డీజీపీ ద్వారక తిరులమరావు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు యర్లగడ్డ ఉమాదేవి, కాకినాడ సీపోర్టు ఛైర్మన్ కెవిరావు, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ మాదల శ్రీనివాసు, చుక్కపల్లి రమేష్ తదితరులు పాల్గొంటారు.

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

(5వ పేజీ తరువాయి)

చూపిస్తుంది. జిన్నింగ్ మిల్లుల యజమానులు వినియోగిస్తున్న యంత్రాలకు, సీసీఐ బయ్యర్లు వినియోగిస్తున్న యంత్రాలకు తేడా కనిపిస్తుంది. సీసీఐ కేంద్రాల్లో ప్లాస్టిక్ గోతాల్లో పత్తి తీసుకువస్తే కొనుగోలు చేయడంలేదు. దీంతో రైతులు విడిగానే పత్తిని లోడ్ చేసి తీసుకువస్తున్నారు. మినీ ఆటోల్లో పత్తిని ఎక్కువ మొత్తంలో తొక్కడం వల్ల లోపల వేడి పెరిగి తేమ శాతం పెరిగిపోతుందని రైతులు చెబుతున్నారు. ఒకే లాట్‌లో ఐదు రకాలుగా తేమ శాతం నమోదవుతుంది.

రవాణా భారం తడిసి మోపెడు..

మద్దతు ధర వస్తుందన్న ఆశతో సీసీఐ కేంద్రాలకు రైతులు పత్తిని తరలిస్తున్నారు. అందుకు రవాణా భారం తడిసి మోపెడవుతోంది. అయితే అంత భారం భరించి తీసుకువచ్చిన తర్వాత తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొన్ని లాట్లు కొను గోలుకు బయ్యర్లు సుముఖత చూపటం లేదు. దీంతో దానిని వెనక్కి తీసుకెళ్లడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ఉదాహరణకు గుంటూరు మండలం చౌడవరం నుంచి జూటూరి వెంకయ్య అనే రైతు ఐదో మైలు వద్ద ఉన్న జగ్గయ్యపేట కేంద్రానికి 15 క్వింటాళ్ల పత్తిని తీసుకువచ్చేందుకు రూ.2500 వ్యయమైంది. పత్తి లోడ్‌కు క్వింటాల్‌కు రూ.150 కింద ఖర్చు అయ్యింది. తెచ్చిన మొదటి రోజు కొనుగోలు చేయకపోవ డంతో ఆటో వెయిటింగ్ చార్జి కింద రూ.1000 వరకు చెల్లిం చారు. అంత వ్యయం చెల్లించి ఒకరోజు అంతా నిరీక్షించినా తేమ శాతం అధికంగా ఉందని కొనుగోలు చేయలేదు. ఆ పత్తిని తిరిగి తీసుకువెళ్లడం రైతుకు తలకు మించిన భారమైంది. సీసీఐకి తీసుకువచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందంటున్న రైతులు ఎంతో కొంత తగ్గించి అయినా కొనుగోలు చేయాలని అధికారులను కోరుతున్నారు.

తేమ శాతం పెంచి కొనుగోలు చేయాలి

మలిపెద్ది లక్ష్మీ నారాయణ, కొర్రపాడు, మేడికొండూరు మండలం



ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురిశాయి.ఇప్పుడు చలి కాలం వచ్చేసింది. గాలిలో తేమ శాతం పెరిగిపోయింది. ఇటు వంటి పరిస్థితిలో పత్తి ఆరాటం చాలా కష్టం. సీసీఐ అధికారులు తేమ శాతం పెంచి పత్తిని కొను గోలు చేయాలి. లేకపోతే పత్తి రైతులు ఆత్మహత్యలు చేసు కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ధర తగ్గించి అయినా కొనుగోలు చేయాలి

జుటూరి వెంకయ్య, చౌడవరం, గుంటూరు మండలం



సీసీఐ కేం ద్రానికి తెచ్చిన పత్తిని తిరిగి తీసుకు వెళ్లడం తలకు మించిన భారం. ఒక వేళ తేమ శాతం ఎక్కువగా ఉంటే ధరలో ఎంతో కొంత కోత విధించి పత్తి కొనుగోలు చేయాలి. ఈ విషయంలో అధి కారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్ వాడీలు

అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడులు ఆపండి

వర్కర్స్ అండ్ హెల్పర్స్ ధర్నా

బెల్లంకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడులు ఆపాలని సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి జీ మల్లేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌తో మంగళ వారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్లంకొండ మండలం మన్నె సుల్తాన్ పాలెంకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బుజ్జి తన భర్తపై అధికార పార్టీ నాయకులు అంగన్ వాడీ ఉద్యోగానికి రాజీనామా చేయాలని అసభ్యకరంగా తిట్టి ఆమెపై దాడి చేసినట్టు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్ వాడీలు తమ సమస్యల పై 42 రోజుల పాటు సమ్మె చేస్తే సమ్మె శిబిరాల వద్దకు వచ్చిన తెలుగుదేశం నాయ కులు అంగన్‌వాడీలకు రక్షణగా ఉంటామన్నారని, ప్రతిపక్షంలో ఉండగా రక్షణ కల్పిస్తామని మాట్లాడిన పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అంగన్‌వాడీలపై దాడులు చేయడం దుర్మార్గమని విమర్శిం చారు. అంగన్‌వాడీలు తమ విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్పా భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని అన్నారు. నాయకులు దాడులు ఆపక పోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జీ రవి బాబు మాట్లాడుతూ నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో అంగన్ వాడీ కార్యకర్తలపై, మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇటువంటి విధానాన్ని నిరోధించటానికి ఎమ్మెల్యే ప్రవీణ్ చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ పుల్లారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న పద్ధతుల్లో విద్యార్థులకు బోధన అందించాలి

గుంటూరు(విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి వినూత్న పద్ధతుల్లో బోధన అందించాలని ఉర్దూ డీఐ ఎస్‌కెఎండి ఖాసిం అన్నారు. స్థానిక చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని ఉర్దూ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు మెరుగైన పద్ధతుల్లో బోధించాలని సూచించారు. తూర్పు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అనుసరించే బోధన విధానాలు పిల్లలు ఆకట్టుకునే విధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సముదాయ ఛైర్మన్ వసుంధర, వివిధ మండలాల ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రిఫరేషన్‌తో కూడిన విద్యాబోధన చేయాలి : ఎంఈవో

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ప్రిఫరేషన్‌తో కూడిన విద్యాబోధన చేయాలని ఎంఈవో ఎస్.నిరంజన్ తెలిపారు. అప్పికట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంఈవో పాల్గొని పాఠశాలల నిర్వాహణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యక్రమాలపై వివరించారు. ఉపాధ్యాయులు బ్లాక్‌బోర్డు, టీఎల్ఎం ఉపయోగిస్తూ బోధించాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కెఎకె జిలానీ, కాంప్లెక్స్ సెక్రటరి మద్దాల సురేష్, సీఆర్పీ టి.మాణిక్యారావు, అప్పికట్ల, కొండుభొట్లపాలెం కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్తాయపాలెంలో...

ఉపాధ్యాయులు అంకితభావంతో అవగాహనతో కూడిన విద్యాబోధన విద్యార్థులకు అందించాలని ముత్తాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సుందరరాజు తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సుందరరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా విద్యార్థులకు బోధించాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్‌నాయకులు గురజాల శ్రీనివాసరావు, సిఆర్పీజాన్ వెస్లీ, శేషాద్రి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ కక్ష సాధింపు రాక్షస పాలనకు పరాకాష్ట : కొల్లా

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ స్టేట్‌మెంట్‌ను అడ్డగోలుగా మార్చేసి ఏ తప్పు చేయని నాటి ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేసి 53 రోజులు జైలులో పెట్టి హింసించటం జగన్ నీచ ధూర్తపాలనకు నిదర్శనంగా నిలిచిపోతుందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జరగని అవినీతిని జరిగినట్లు చిత్రీకరించి అందుకు సంబంధించిన ఫైళ్లను మాయం చేసి చంద్రబాబును అరెస్టు చేసిన కుట్ర జగన్ కక్ష సాధింపు రాక్షస పాలనకు పరాకాష్ట అన్నారు.

నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ ధర్నా

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబాల ప్రజలకు నివేశన స్థలాలిచ్చి గృహ నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జేబీ శ్రీధర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్కా రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొని 3వ వార్డు, 2వ సచివాలయంలో అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయటమే వాసవి క్లబ్ లక్ష్యం

కర్లపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవా కార్యక్రమాలు చేయడమే వాసవి క్లబ్ లక్ష్యమని వాసవి క్లబ్ గవర్నర్ పువ్వాడ నాగ వెంకట నారాయణ అన్నారు. కర్లపాలెం క్వీన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో వాసవి క్లబ్ గవర్నర్ నాగ వెంకట నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ సభ్యులు నాగ వెంకట నారాయణ, నంబూరు నాగభూషణరావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొలిశెట్టి రాంబాబు, కిరణ్‌కుమార్, వాసవిక్లబ్ మాజీ అధ్యక్షులు తడికమల్ల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పిట్టలవానిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాల చోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌లను ధరించి వాహనాలను నడపాలని చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రెడ్డిపాలెం కూడలిలో మంగళవారం చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన వాహన పత్రాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని తెలిపారు. లేనిచో చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింకు చేయించుకోవాలి

పిట్టలవానిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 12 గ్రామ సచివాయాలలోని ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందే వినియోగదారులు తమ బ్యాంక్ ఖాతాలకు తప్పనిసరిగా ఆధార్ లింకు చేయించుకోవాలని చందోలు గ్రామపంచాయతీ కార్యదర్శి బి.సుజాత తెలిపారు.

ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక : తహసీల్దార్

రేపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రజలసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కమిషనర్ సాంబశివరావు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ పురపాలకసంఘంలోని వివిధ వార్డుల్లోని పారిశుధ్యం, తాగునీటి సరఫరా,మురుగునీటి పారుదల, వీధి దీపాలు, మొదలగు ప్రజా సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించటం జరుగుతుందని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఐదు గంటల పాటు విద్యుత్ నిలిపివేత

వేమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వేమూరు విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి 11 కెవి కోడిపర్రు ఫీడర్‌పై బుధవారం మరమ్మతులు నిమిత్తంగా ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ వంశీ తెలిపారు. బలిజేపల్లి, వరహాపురం, బేతాళపురం, బూతుమల్లి గ్రామాల పరిధిలోని గృహాలకు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సరఫరా నిలిపివేస్తామని అన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతుల పనులు జరుగుతాయని, అనంతరం విద్యుత్ సరఫరా ఇవ్వడం జరుగుతుందని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ

● రూ.7.58 కోట్లతో గ్రామీణ రహదార్లు అభివృద్ధి




బాపట్ల మండలంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టింది. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయి. ఒక్కరోడ్డు నిర్మాణం కూడా చేపట్టలేకపోయారు. ఉన్న రోడ్లపై పడిన గుంతలను పూడ్చలేకపోయారు. దీనివల్ల అనేక ప్రమాదాలు జరిగి వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ పల్లెలకు పండుగవాతావరణం తీసుకొచ్చారు. పల్లెపండుగ పేరుతో గ్రామాలలోని అంతర్గతరోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో రూ.7 కోట్ల 58 లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. బాపట్ల మండలంలోని మరుప్రోలువారిపాలెంలో రూ.10 లక్షలు, అడవిపంచాయతీలో రూ.25 లక్షలు, ముత్తాయపాలెంలో రూ.15 లక్షలు, అప్పికట్లలో రూ.20లక్షలు, మర్రిపూడిలో రూ.20 లక్షలు, ఈస్ట్‌బాపట్లలో రూ.16 లక్షలు, పిన్నిబోయనవారిపాలెంలో రూ.13 లక్షలు, కంకటపాలెంలో రూ.21 లక్షలు, నరసాయపాలెంలో రూ.39.50 లక్షలు, మూలపాలెంలో 29.60 లక్షలు, వెస్ట్ బాపట్లలో రూ.20 లక్షలు, స్టూవర్టుపురంలో రూ.12.40 లక్షలు, వెదుళ్ళపల్లిలో రూ.15 లక్షలు చొప్పున అభివృద్ధి పనులకు కేటాయించారు.

కర్లపాలెం మండలం బుద్దాం గ్రామపంచాయతీలో రూ.4 లక్షలు, చింతాయపాలెం రూ.10 లక్షలు, దమ్మనవారిపాలెంలో రూ.10 లక్షలు, దుండివారిపాలెంలో రూ.10 లక్షలు, గణపవరంలో రూ.5 లక్షలు, కర్లపాలెంలో రూ.60 లక్షలు, కొత్తనందాయపాలెంలో రూ.10 లక్షలు, నాగరాజుపాలెంలో రూ.5 లక్షలు, నల్లమోతువారిపాలెంలో రూ.15 లక్షలు, నర్రావారిపాలెంలో రూ.10 లక్షలు, పాతనందాయపాలెంలో రూ.10 లక్షలు, పెదగొల్లపాలెంలో రూ.20 లక్షలు, పెదపులుగువారిపాలెంలో రూ.10 లక్షలు, పేరిలో రూ.20 లక్షలు, సమ్మెటవారిపాలెంలో రూ.5 లక్షలు, తుమ్మలపల్లిలో రూ.12 లక్షలు, యాజలిలో రూ.20 లక్షలు, ఏట్రవారిపాలెంలో రూ.20 లక్షల చొప్పున కేటాయించి అభివృద్ధి పనులు చేస్తున్నారు.

పిట్టలవానిపాలెం మండలంలో పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలో రూ.33.50 లక్షలు, ఖాజీపాలెంలో రూ.30.60 లక్షలు, కొత్తపాలెంలో రూ.16.51 లక్షలు, పాతనకట్టవారిపాలెంలో రూ.7.50 లక్షలు, అల్లూరులో రూ.16 లక్షలు, భవనవారిపాలెంలో రూ.20 లక్షలు, కోమలిలో రూ.10 లక్షలు, జిఎస్‌పాలెంలో రూ.20 లక్షలు, అలకాపురంలో రూ.22.70 లక్షలు, మంతెనవారిపాలెంలో రూ.16 లక్షలు, చందోలులో రూ.30 లక్షలు, సంగుపాలెంలో రూ.5 లక్షలు, పిట్టువారిపాలెంలో రూ.13.21 లక్షల చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదార్లు, శ్మశానవాటికలు, గోకులంషెడ్‌లు, ఇతర పనులను ఆయా నిధులతో చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి పనులపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతున్నది.

గోపికృష్ణ మృతి పార్టీకి తీరనిలోటు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



గోపికృష్ణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నరేంద్రవర్మ, గుంట్రెడ్డి శివ తదితరులు

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నాయకుడు పెరుమాళ్ళ గోపికృష్ణ మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని కాకుమానువారిపాలేనికి చెందిన గోపికృష్ణ సోమవారం రాత్రి హఠాన్మరణం చెందారు. ఆయన మృతి గురించి తెలుసుకున్న పార్టీశ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుంట్రెడ్డి శివ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్, శీలం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పాఠశాలల పనివేళల పెంపు ప్రయోగం ఆపాలి : ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని పునఃసమీక్షించి ఉత్తర్వులు రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యాయుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశానికి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలో పలురకాల యాప్‌లు, ఆన్‌లైన్ పనులు వంటి బోధనేతర పనులు రెసిడెన్షియల్ శిక్షణలతో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనఅవుతున్నారన్నారు. మొదటి దశగా బోధనకు ఆటంకం కలిగిస్తున్న యాప్‌లను రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు బొంతా వెంకటేశ్వర్లు, పివి.నాగరాజు, ఎన్‌బీ సుభానీ, జి.ఉదయశంకర్, గవిని శ్రీనివాసరావు, పి.శివాంజనేయులు, ఎవి నారాయణ, నారాయణమూర్తి, తోట శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలి : కమిషనర్



కిరణా, రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులతో కమిషనర్

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బాపట్ల కిరణా, రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ వారితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారం రోజులు గడువు ఇస్తున్నామని అనంతరం పట్టణంలో ఏ దుకాణంలోనైనా ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు సమాచారం ఉంటే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు కూడా క్యారీబ్యాగ్‌లు వినియోగించకుండా గుడ్డ సంచులు వినియోగించి సహకరించాలని కోరారు. సమావేశంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాపుడా ఛైర్మన్‌కు పలువురి అభినందనలు



సలగల రాజశేఖరబాబును అభినందిస్తున్న మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు తదితరులు

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబును మంగళవారం పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. బాపట్ల అభివృద్ధిలో తామంతా భాగస్వాములమౌతామని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు తెలిపారు. ప్రణాళిక ప్రకారం బాపట్ల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావిపూడి ఆంజనేయులు, చుండూరు వెంకటస్వామి, యామర్తి హేమచంద్రరావు, ఎన్.గోపి, గొర్రెముచ్చు ఆనందరావు, తూనిగుంట్ల ఆనందబాబు, ఆనంద్ తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

కర్లపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం బస్టాండ్‌లో మద్యం సేవించటం, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినట్లైతే కఠిన చర్యలు చేపడతామని ఎస్ఐ రవీంద్ర అన్నారు. బస్టాండ్‌లో మద్యం సేవించి, సిగరెట్లు తాగి బస్టాండ్‌ను అస్తవ్యస్తంగా చేస్తున్నారని ఆటోడ్రైవర్‌లపై ఎస్ఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్త బస్టాండ్ ముందు ఆటోలు నిలపరాదని, ఆటోలు నిలిపినట్లైతే కఠిన చర్యలు చేపడతానని డ్రైవర్‌ను హెచ్చరించారు. కర్లపాలెం బస్టాండ్‌లో మంగళవారం సాయంత్రం ఎస్ఐ రవీంద్ర, ఎంపీడీవో శ్రీనివాసరావు సమావేశమై పలు సూచనలు చేశారు. పంచాయతీ వారితో మాట్లాడి బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేయించారు.

కేంద్ర, రాష్ట్రాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

రేపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్రాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని సీనియర్ బీజేపీ నాయకులు రాంపల్లి జగన్నాథశాస్త్రి అన్నారు. స్థానిక బీజేపీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీని తీరప్రాంతంలో బలపరిచే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయ్యాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని, వాటిని ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కొలగాని సునీత, అన్నం సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని రైతులకు వివరిస్తున్న ఏవో

కొల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.వెంటేశ్వరరావు తెలిపారు. అనంతరం, క్రాప గ్రామాల్లో ధాన్యం విక్రయాలపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ, రైతులు తొందరపడి తక్కువ ధరలకు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని సూచించారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2320, 75 కేజీల బస్తాకు రూ.1740 మద్దతు ధర నిర్ణయించిందని చెప్పారు. మీ గ్రామ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని కలిసి మీరు ధాన్యాన్ని ఏ రోజు అమ్ముతారో తెలియజేస్తే తేమశాతం నిర్ధారణ చేసి కూపన్ ఇస్తారన్నారు. దాని ప్రకారం ఆ రోజు ధాన్యం విక్రయించుకోవచ్చని, గోనే సంచుల వినియోగాన్ని రూ.3.39, హమాలీ చార్జి క్వింటా రూ.17.17గా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దళారుల తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ ఇన్‌చార్జి శివన్నారాయణ, అనంతవరం విఎఎ సాంబనాయక్, రైతులు పాల్గొన్నారు.

చినపులివర్రులో కార్తీక దీపోత్సవం

కొల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామం చినపులివర్రులో మంగళవారం తెల్లవారుజామున కార్తీక దీపోత్సవం నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శివలింగాకారంలో దీపోత్సవం జరిపారు. అనంతరం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ, కార్తీక దీపం పరబ్రహ్మ స్వరూపమని, కార్తీక మాసంలో దీపారాధన చేయడం వల్ల సకల పాపాలు తొలగి శుభం కలుగుతుందన్నారు. కార్తీక మాసం శివకేశవుల మాసమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కన్వీనర్లు మందలపు రాజకుమారి, కూచిభట్ల లక్ష్మీగాయత్రి, మల్లేశ్వరి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి అభ్యంతరాల స్వీకరణ

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లకు మరో అవకాశం

వేమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించిన ఓటర్లుగా నమోదు చేసుకున్న వారి దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని నియోజకవర్గ ఎన్నికల అధికారి సుశీల అన్నారు. ఆమె మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ, దరఖాస్తులు పూర్తయిన వాటిపై డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో ఉన్న ఓటర్ల జాబితాలో ఓటర్లు తమ పేర్లను పరిశీలించేందుకని అభ్యంతరాలను ఈనెల 23వ తేదీ నుంచి డిసెంబరు 9 లోపుగా తెలియజేసుకునే అవకాశం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఓటర్లుగా చేరని పట్టభద్రులు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కావడానికి పది రోజులు ముందు వరకు దరఖాస్తులు స్వీకరించే అవకాశాన్ని కమిషనర్ కల్పించారన్నారు. సంబంధించిన దరఖాస్తులను నామినేషన్ల ప్రక్రియ ప్రారంభానికి ముందు పరిశీలించి ఖరారు చేయడం జరుగుతుందని వివరించారు.

వీవోఏల అక్రమ తొలగింపులు ఆపాలి



వీవోఏల అక్రమ తొలగింపులను ఆపాలంటూ ధర్నా నిర్వహిస్తున్న చిత్రం

రేపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా వీవోఏల అక్రమ తొలగింపులను ఆపాలని బాపట్ల జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. ఐకేపీ కార్యాలయం వద్ద మంగళవారం వీవోఏ యానిమేటర్‌లు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్రమ తొలగింపులను ఆపాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకుని వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. పేద మహిళలుగా డ్వాక్రాసంఘాలు నిర్వహిస్తూ వీవోఏలుగా జీవనం పొందుతున్నవారిని అకారణంగా ఎటువంటి గ్రామసమాఖ్యసంఘాలు అనుమతి లేకుండా తొలగించటం మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం ఏపీఎంకి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.గోపి, ఎ.ఆశీర్వాదం, రేపల్లె మండలంలోని ఐకేపీ, ఈవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ ఆపార్‌కార్డు నమోదు చేయించుకోవాలి

కర్లపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు పుట్టిన తేది ధ్రువీకరణపత్రం ఆధార్‌కార్డులు లేని ఎస్టీ కుటుంబాలవారికి ఉచితంగా ఆధార్ నమోదు చేయాలని ఆపార్ సెంటర్‌ల సిబ్బందిని ఎంపీడీవో ఆద్దూరి శ్రీనివాసరావు ఆదేశించారు. పేరలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపార్ సెంటర్‌ను ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో మనోరంజనీ మంగళవారం సందర్శించారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆపార్‌కార్డు నమోదు చేయించుకోవాలన్నారు. మధ్యాహ్నభోజన పథకాన్నిపరిశీలించారు. చింతాయపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో శ్రీనివాసరావు, మనోరంజనీ పాల్గొన్నారు. పేరలి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై కొవ్వొత్తుల ప్రదర్శన

బాపట్లనవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అంగన్‌వాడీ కార్యకర్తలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బాలల హక్కులపై అవగాహన కల్పిస్తూ పీడీ కార్యాలయం దగ్గర నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, డీసీపీవో పురుషోత్తమరావు, సీడీపీవో పార్వతి, శిశు గృహ మేనేజర్ రోజులీనా, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దత్తత అవగాహన మాసోత్సవాలు

స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం దత్తత అవగాహన మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీపీవో పురుషోత్తమరావు మాట్లాడుతూ దత్తత కావాల్సిన తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా మాత్రమే దత్తత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలల సంరక్షణాధికారి కృష్ణ, సీడీపీవో పార్వతి, రోజులీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు మిషన్‌మోడ్‌లో పనిచేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

● ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటినందించాలి



గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించటానికి అధికారులు మిషన్‌మోడ్‌లో పని చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. డీడబ్ల్యుఎస్ఎం (డిస్ట్రిక్ట్ వాటర్ శానిటేషన్ మిషన్) జిల్లా స్థాయి కమిటీ తొలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కమిటీకి కన్వీనర్‌గా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వ్యవహరించగా 14 జిల్లా శాఖల అధికారులు కమిటీలో సభ్యులుగా ఉంటారని కలెక్టర్ ప్రకటించారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించటం, వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం పగడ్బందీగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కమిటీపై ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 3.64 లక్షల గృహాలు ఉండగా 1.48 లక్షల గృహాలకు కుళాయిలు బిగించినట్లు తెలిపారు. మిగిలిన 2.16 లక్షల గృహాలకు కనెక్షన్‌లు ఇవ్వలేదన్నారు. జలజీవన్‌మిషన్ కింద జిల్లాకు మంజూరైన పనులలో పెండింగ్ పనులు 994 చేపట్టటానికి అనుమతి పొందాల్సి ఉందన్నారు. రూ.587 కోట్ల నిధులతో పనులు ప్రారంభించటానికి ప్రభుత్వం నుంచి తిరిగి అనుమతి పొందేలా నివేదించాలన్నారు. జిల్లాలో 960 ఆవాస ప్రాంతాలు ఉండగా అందులో 369 పిడబ్ల్యుఎస్ పథకాలు, 25 సిపి డబ్ల్యుఎస్ పథకాలు, 5083 చేతిపంపులు మనుగడలో ఉన్నాయన్నారు.

● సీపీడబ్ల్యు పథకాల నిర్వహణ, మరమ్మతులకు 6.9కోట్ల రూపాయల నిధులు కావాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు కలెక్టర్ ప్రకటించారు. జిల్లాపరిషత్ నిధులతో పనులు చేపట్టాలన్నారు. జలజీవన్‌మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న పనులన్ని మంజూరు కొరకు ప్రభుత్వానికి నివేదించాలని తీర్మానించారు. గ్రామాలన్నిటిలో పారిశుధ్య పనులు పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కన్వీనర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ అనంతరాజు, అనుబంధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయకపోతే కాంట్రాక్టర్లను తక్షణమే తొలిగించాలి

గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రహదార్ల మరమ్మతుల పనులను గుత్తేదారులు చేయకపోతే తక్షణమే తొలిగించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్‌అండ్‌బి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గుంతలు లేని రహదార్లపై ప్రజలు సాఫీగా ప్రయాణం చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు విడుదల చేసిందని చెప్పారు. జిల్లాలో 337 కిలోమీటర్ల పొడవైన రహదార్లపై 67 పనులను గుర్తించామన్నారు. ఇందుకోసం రూ.17.23 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం 12 పనులు మాత్రమే ప్రారంభం కావటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్లు దక్కించుకొని పనులు మొదలు పెట్టకపోతే నోటీసులు జారీ తదుపరి వారిని తక్షణమే తొలిగించాలని ఆదేశించారు. బాపట్ల-గుంటూరు రాష్ట్రీయ రహదారిని జాతీయ రహదారిగా మార్చటానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి డీఈ గీతారాణి, అరుణ, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులలో రిలీఫ్ ఫండ్, ఉద్యోగాలివ్వాలి

● కలెక్టర్‌ను కోరిన దళిత హక్కుల పరిరక్షణసమితి అధ్యక్షుడు నాగేంద్ర

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ హత్య కేసులలో బాధితులకు రిలీఫ్ ఫండ్, ఉద్యోగాలివ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళిని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్ర కోరారు. ఈ విషయమై మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చీరాల మండలం ఈపురుపాలెంలో దోనేపూడి బెన్ని అనే దళితుడు హత్యకు గురై 2 సంవత్సరాలైన అతని భార్యకు ఇంతవరకు ఉద్యోగం ఇవ్వలేదన్నారు. బాపట్ల మండలంలో బోడపాటి అను అనే దళిత మహిళ హత్యకు గురైతే ఆమె కుమార్తె ఝాన్సీరాణికి కూడా ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఈ రెండు కేసులలో తహసీల్దార్ రిపోర్ట్ పంపని కారణంగానే ఉద్యోగం ఇవ్వలేదన్నారు. కర్లపాలెంలోని చల్లా పిచ్చయ్య హత్యకు గురై 9నెలలు గడుస్తున్న తహసీల్దార్ రిపోర్ట్ ఇవ్వని కారణంగా రిలీఫ్ ఫండ్ అందలేదన్నారు. వెంటనే స్పందించిన కలెక్టర్ బాధితులకు న్యాయం చేయాలని డీఆర్‌వో గంగాధర్‌గౌడ్‌ను ఆదేశించారు. గిరిజన నాయకుడు గంటా సుబ్బారావు, మాలమహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి పాల్గొన్నారు.


లక్ష్యాల సాధనకు ప్రణాళికతో ముందుకు సాగాలి : ఎస్పీ

బాపట్ల, వేమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యాల సాధనకు సరైన ప్రణాళికతో ముందుకుసాగాలని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఎస్పీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు యువతకు, ప్రజలకు తెలియజేసే విధంగా జిల్లాలోని పోలీసు సిబ్బందికి, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్ళు, సైబర్‌నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశాలపై నిర్వహించిన ఈ పోటీలలో బాపట్ల ఐటికోర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ.కీర్తి ప్రథమ బహుమతి, వేమూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ సీహెచ్ గాస్పెల్ జ్యోతి ద్వితీయ బహుమతి, కారంచేడు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.నాగతులసీ తృతీయ బహుమతి సాధించారన్నారు. విద్యార్థుల విభాగంలో వేమూరు మండలం పెరవలి గ్రామంలోని సిబిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని బండారు ధనుశ్రీ ప్రథమ బహుమతి, చీరాల కొత్తపేటలోని బి.ఆర్.కె.హైస్కూల్ విద్యార్థి ఎస్.లక్ష్మీసాయి రాహుల్ ద్వితీయ బహుమతి, మార్టూరులోని శ్రీ శ్రీనివాసహైస్కూల్ విద్యార్థిని పి.సాయి కీర్తి తృతీయ బహుమతి చొప్పున సాధించారన్నారు. వీరికి ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులతోపాటు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు, సర్టిఫికెట్‌లు అందుకున్న వారితో ఎస్పీ తుషార్‌డూడి

సహకార సంఘ వారోత్సవాలు ప్రారంభం



జెండా ఆవిష్కరిస్తున్న సహకార శాఖ అధికారి శ్యాంసన్

కొల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘ వారోత్సవాలను ఆ శాఖ అధికారి సిహెచ్ శ్యాంసన్ మంగళవారం జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. మండల పరిధిలోని గాజుల్లంక సహకార పరపతి సంఘం ఆవరణలో నిర్వహించిన వారోత్సవాల్లో సంఘ పిఐసి చంద్రకుమార్ సభకు అధ్యక్షత వహించారు. సహకార విద్యాధికారి గోగుల శ్రీనివాసరావు సహకార సంఘం పూర్వపరాలను, అభివృద్ధిని వివరించారు. సహకార శాఖాధికారి శ్యాంసన్, ఆడిట్ అధికారి తిరుపాలరెడ్డి సహకార సంఘ సేవలు, చట్టాలు, సహకార విద్య, సంఘాల అభివృద్ధి, సహకార శాఖ నిర్వహిస్తున్న ఎరువులు, వరి కొనుగోలు కేంద్రాలు, పెట్రోల్ బంకు తదితర వాటి నిర్వహణలు గురించి తెలియజేశారు. సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేసినట్లు జీడీసీసీ బ్యాంకు మేనేజర్ పి.నాగేశ్వరరావు సభాముఖంగా వివరించారు. కార్యక్రమంలో గాజుల్లంక, ఈపూరు, దోనేపూడి, క్రాప సహకార సంఘాల సీఈవోలు తాడికొండ నరేష్, పొన్నం శ్రీనివాస్, చేబ్రోలు శ్రీకాంత్, యేల్చూరి రామకృష్ణారావు రైతులు పాల్గొన్నారు.

వాయిద్యం అంటే ఆమెకు ప్రాణం... డోలుపై ఆమెకు మరింత మక్కువ. మగవారే కాదు... మహిళలూ వాయిద్యాలతో అద్భుతాలు సృష్టించగలరని నిరూపించారామె. డోలు పట్టుకుంటే సున్నితమైన ఆమె చేతివేళ్లు దానిపై లయబద్ధంగా నాట్యం చేస్తాయి... 108 తాళాలు శ్రవణానందకరంగా ఉర్రూతలూగిపోతాయి. ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా 1000కి పైగా కచేరీలు చేయటం ఒక ఘనతఅయితే, డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సాధించటం మరో ప్రత్యేకత.


డోలు వాయిస్తున్న మనీషా బాబీ (లలిత మనీషా)

లలిత మనోహరం డోలు వాయిద్యం

- తెనాలికి చెందిన లలిత మనీషాఅద్భుత ప్రదర్శనలు
- డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా ఘనత
- తల్లిదండ్రుల స్ఫూర్తితో గిన్నిస్ రికార్డులూ సొంతం


మంత్రి మనోహర్ దగ్గర కుటుంబ సభ్యులకు సత్కారం

తెనాలి, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): ఆమె పేరు లలిత మనీషా(మనీషా బాబీ). తెనాలికి చెందిన వెంకటేశ్వర సాహెబ్, మస్తాన్‌బీల కుమార్తె లలిత మనీషా. ఆమె తల్లిదండ్రులు కూడా సన్నాయి వాయిద్యంలో దిట్టయితే, వీరి దారిలోనే కుమార్తెకూడా అడుగులు వేశారు. ఎవరైనీ తమ పిల్లలను తాము చేస్తున్న వృత్తి కాకుండా మరింత ఉన్నత చదువులు చదివించాలని, ఉన్నతస్థానంలో నిలపాలని తాపత్రయపడతారు. అయితే మనీషా తల్లిదండ్రులు కూడా ఆమె ఇష్టానికే ప్రాధాన్యం ఇచ్చారు. మనలో దాగిన నైపుణ్యాన్ని వెలికితియ్యటానికి పరుగులుపెట్టాల్సిన పనిలేదని, ఏదిఇష్టమో దానిలో రాణించగలిగితే రికార్డులు సృష్టించవచ్చని మనీషా నిరూపించారు. కళలకు నిలయమైన తెనాలికే గర్వకారణంగా నిలిచారు.

చిన్నప్పటి నుంచే డోలుపట్టి...

మనీషాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ఆమె తాత నాసర్ మస్తాన్ ప్రముఖ నాదశ్వర విద్వాంశులు. అయితే తన తల్లిదండ్రులు సన్నాయి వాయిద్యంలో ప్రావీణ్యం కలిగినవారు కావటం, నాదస్వరంలో ప్రత్యేకతను చాటటంతో, చిన్నప్పటి నుంచి వాటిని చూస్తూ వాయిద్యాలపై ఆమె మక్కువ పెంచుకున్నారు. పాఠశాల విద్య చదువుతున్న రోజుల్లోనే డోలు పట్టుకున్నారు. లేత చేతులతో డోలుపై తాళాలు వేయగలిగారు. ఆమెకున్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు డోలు వాయిద్యం విషయంలో ప్రోత్సహించారు. చదువుకుంటూనే అనేక కార్యక్రమాల్లో పాల్గొని, కచేరీలు చేయటం విశేషం. తెనాలిలోనే పాఠశాల విద్య, ఉన్నత విద్య బీసీఏ కూడా తెనాలిలోనే పూర్తిచేశారు. తర్వాత హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మ్యూజిక్(డోలు)లో డిప్లమో చేశారు. అనంతరం తమిళనాడులోని అన్నామలై యూనివర్శిటీ, చిదంబరంలో డోలు వాయిద్యంపై పీజీ పూర్తిచేశారు. అయితే డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొదట డోలు విద్వాంసులు టీఆర్ సుబ్రహ్మణ్యం దగ్గర డోలు నేర్చుకున్నారు. చిదంబరంలో డోలు విద్వాంసులు టీజీ బాబు దగ్గర కూడా కొంత కాలం డోలు వాయిద్యంలో తాళాలు నేర్చుకున్నారు. డోలు వాయిద్యంలో 108 తాళాలుంటే, వాటిలో 35 తాళాలు అప్పట్లోనే నేర్చుకుని, మిగిలిన తాళాలు పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారు.


తల్లి, తండ్రి కుటుంబ సభ్యులతో కలసి కచేరీ చేస్తూ...



తెలంగాణ రాజ్‌భవన్‌లో పూర్వ గవర్నర్ తమిళిసై నుంచి సత్కారం అందుకుంటున్న మనీషా

పురస్కారాలు... ప్రశంసలు

మనీషా డోలు వాయిద్య విద్యలో పీజీ చేయక ముందు నుంచే అనేక కచేరీలు చేశారు. చిన్నతనంలోనే ఎందరో ప్రముఖుల మన్ననలు పొందారు. తన డోలు ప్రావీణ్యానికి మెచ్చిన న్యూ లైఫ్ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందించింది. 2019లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన ఇంటర్నేషనల్ మథర్ తెరీసా గోల్డ్‌మెడల్ అవార్డ్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపి గోల్డ్ మెడల్‌ను సాధించారు. సిలికానాంధ్ర ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన నాదశ్వర డోలు వాయిద్యం ప్రదర్శనలో గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తమిళనాడు పూర్వ గవర్నర్ తమిళిసై వంటి ప్రముఖుల చేతులు మీదగా పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, భద్రాచలం, కాశీ, పూరి, హరిద్వార్, ద్వారకలో జరిగిన కార్యక్రమాల్లోనూ ప్రతిభ చూపారు. యువతకు ఆదర్శంగానిలిచారు.

ఓటర్లుగా అర్హులైన పట్టభద్రులు

- 80 శాతం పట్టభద్రుల దరఖాస్తులు పరిష్కారం
- నేటి సాయంత్రానికి ముసాయిదా ఓటరు జాబితా
- 23న ప్రచురణకు చర్యలు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టరు


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్‌వో కాజావలి

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యుని ఎన్నికకు అర్హులైన పట్టభద్రులను ఓటరుగా నమోదు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచిం చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఓటరు నమోదు నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6వ తేదీ వరకు పట్టభద్రుల శాసనమండలి ఓటుకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చి నవంబరు 20న ముద్రించి 23న ప్రచురి స్తారన్నారు. ఇప్పటి వరకు 2,83,100 మంది ఆన్‌లైన్ ద్వారా ఓటుకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఆఫ్‌లైన్‌లో 48,900 మంది కలిపి మొత్తం 3 లక్షల 32 వేల మంది దరఖాస్తు చేస్తుకున్నారన్నారు. ఇందులో 80 శాతం దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన 20 శాతం దరఖాస్తులను బుధవారం సాయంత్రానికి పూర్తి చేసి డ్రాఫ్ట్ ఓటరు జాబితా ముద్రణ కోసం పంపుతామన్నారు. నవంబరు 23వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేది వరకు ముసా యిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 25వ తేదీ నాటికి పరిష్కరించి, ఆ నెల 30న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు.

2019 ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో 2,48,799 మంది ఓటర్లకు గాను 362 పోలింగ్ కేంద్రాలను వినియోగించడం జరిగిందని, 2025 ఎన్నికలకు 3 లక్షల 32 వేల మంది ఓటర్లకు ఆరు జిల్లాల్లో 421 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించామన్నారు. అయితే తుది ఓటర్ల జాబితా ప్రచురితమయ్యే నాటికి పోలింగ్ కేంద్రాల సంఖ్యలో మార్పులు జరగొచ్చన్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 900 మంది ఓటర్లు ఓటు వేసే అవకాశం వుందన్నారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, డాక్టర్ టి సేవాకు మార్ (ఏపీపీ), చిరుతనగండ్ల వాసు(బీఎస్‌పీ), బీ పాండురంగ విఠల్(బీజేపీ), వై కృష్ణకాంత్(సీపీఎం),బీ.సునీల్ కుమార్(కాంగ్రెస్), కంచర్ల శివరామయ్య (టీడీపీ),ఏఈఆర్వోలు, ఎలక్షన్‌సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో శబరిమల యాత్రకు వెళ్లే యాత్రీకుల సౌకర్యార్థం ఏటా రైల్వే శాఖ నడిపే ప్రత్యేక రైళ్లకు సంబంధించి ఈ ఏడాది ప్రకటన విడుదలైంది. నంబరు. 07145 మచిలీపట్నం - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 25, డిసెంబరు 2, 9, 16 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చి 6.02కి బయలుదేరుతుంది. నెంబరు. 07146 కొల్లం - మచిలీపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 27, డిసెంబరు 4, 11, 18 తేదీల్లో (బుధవారం) వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి గురువారం వేకువజామునకు ముందు 2.50కి న్యూగుంటూరుకు వస్తుంది.

ఈ రైళ్లకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెనాలి, బాపట్ల, చీరాలలో నిలుపుదల సౌకర్యం కల్పించారు. ఈ నెల 22, 30 తేదీల్లో నవంబరు. 07147 మచిలీపట్నం - కొల్లంస్పెషల్ మధ్యాహ్నం 3.15కి గుంటూరు, సాయంత్రం 4 గంటలకు నరసరావుపేట, 4.45కి వినుకొండ, మరుసటి రోజు రాత్రి 9.20కి కొల్లాం చేరుకొంటుంది. నంబరు. 07148 కొల్లాం - మచిలీపట్నం స్పెషల్ ఈ నెల 25, డిసెంబరు 1 తేదీల్లో(బుధవారం) వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి గురువారం ఉదయం 6.08కి వినుకొండ, 6.38కి నరసరావుపేట, 8 గంటలకు గుంటూరుకు చేరుకొంటుందని డీఆర్‌ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేరేచర్ల లేఅవుట్‌లో విద్యుత్ తీగల చోరీ


పేరేచర్ల లేఅవుట్‌లో వేసిన విద్యుత్ స్తంభాలు, వరుసగా అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

- నిర్మాణాలు నామమాత్రమే..
- లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- ఇదే అదనుగా చెలరేగిపోతున్న విద్యుత్ తీగెల చోరీ ముఠా



మేడికొండూరు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పేదల కోసమంటూ మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో ఏర్పాటు చేసి లేఅవుట్‌లో విద్యుత్ తీగెల(కండక్టర్)ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. లేఅవుట్‌లో 18 వేల ప్లాట్లను పేదలకు కేటాయించినా గృహ నిర్మాణాలు నామ మాత్రంగానే జరిగాయి. అయినా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేశారు. ఇదే అదనుగా విద్యుత్ తీగెలు చోరీ చేసే ముఠా చెలరేగిపోతున్నది. రోడ్ల నిర్మానాలు పూర్తి కాకపోయినా కేవలం హద్దు రాళ్ల ఆధారంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్లను బిగించారు. భారీ సబ్ స్టేషన్ నిర్మాణం కూడా జరిగిపోయింది. ఈ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు కిలో మీటర్ల పొడవున విద్యుత్ వైర్లను వేశారు. అక్కడ ఇళ్లు నిర్మాణాలు జరగకపోవడంతో జన సంచారం అంతగా లేదు. దీంతో విద్యుత్ తీగెల చోరీ ముఠాను అడ్డుకునే వారే లేకుండా పోయారు. ఇప్పటి వరకు సుమారు 4 కిలో మీటర్ల పొడవున లక్షల విలువైన కండక్టర్ వైరు చోరీ జరిగిందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా అవుతున్నా లైన్లలో కండక్టర్ దొంగలించాలి అంటే సాధారణ వ్యక్తులు సాహసించరని, విద్యుత్ లైన్ల గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడుతుంటారని విద్యుత్ అధికారులు అంటున్నారు. ఎటునుంచి విద్యుత్ సరఫరా అవుతున్నది, ఎక్కడ సరఫరా నిలిపి వేయాలి, స్తంభాలపై ఉన్న వైరును కిందకు ఎలా దింపాలో పూర్తిగా తెలిసిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుపై పోలీసులు ఆసక్తి చూపడం లేదు. లైన్లలో విద్యుత్ ఉండగా ఎలా చోరీ జరుగుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చోరీ జరిగినా అప్పట్లో పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదు. తాజాగా డోకిపర్రు ఏఈ ఇచ్చిన ఫిర్యాదును తీసుకున్నారు. దీనిపై ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అంతర్రాష్ట్ర బియ్యం సరఫరా ముఠా అరెస్టు

- ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో సరిహద్దు దాటిస్తున్న వైనం
- అక్టోబరులో జరిగిన ప్రమాదంలో ముఠా గుట్టురట్టు


రేషన్ బియ్యం దందా వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్రంలో ముగ్గురు నిందితులు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని వాహనంలో అర్థరాత్రి రాష్ట్ర సరిహద్దు దాటించి దందాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసు వివరాలు మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన మందపాటి నర్సింహారావు, అదే గ్రామానికి చెందిన కల్లూరి లింగయ్య రేషన్ బియ్యం దందా చేస్తుంటారు. వారి కదలికపై పోలీసులు రెండు నెలలుగా నిఘా ఉంచి వాడపల్లి వద్ద మంగళవారం అరెస్టు చేశారు. దామరచర్ల మండలం బడావత్‌తండాకు చెందిన బడావత్ సర్దార్, మినీ ట్రాన్స్‌పోర్టు వాహన డ్రైవర్ దేవరకొండ అమరయ్య, హమాలీ ముఠామేస్త్రీ సైదారావుతో కలిసి బియ్యం దందా కొనసాగిస్తున్నారు. దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలాల పరిసర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులనుంచి రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.10కి చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ప్రతినెల గ్రామాల్లో తిరిగి సేకరించిన బియ్యాన్ని ఏపీ 39యూఎఫ్ 8418నెంబర్‌గల అశోక్‌లీల్యాండ్ మినీగూడ్స్ వాహనం ద్వారా రాష్ట్ర సరిహద్దు దాటించేవారు. ఆ వాహనంలో రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న క్రమంలో అక్టోబరు 24వ తేదీన దామరచర్ల గ్రామశివారులోని నర్సాపురం ఎక్స్‌రోడ్డు వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో హమాలీ కూలీ షేక్ నాగులు మృతిచెందగా, మరికొంతమందికి గాయపడ్డారు. వాడపల్లి పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్ అమరయ్యను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో రేషన్ బియ్యం రవాణా దందా వెలుగులోకి వచ్చి, నిందితుల వివరాలు బయటపడినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన నర్సింహారావు, లింగయ్యను అరెస్టు చేసి రెండు సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది క్రిమినల్ కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దందాలో స్థానికంగా మరికొందరి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలిందని, నిందితుల ఫోన్ కాల్ రికార్డు ఆధారంగా సూత్ర, పాత్రదారులను గుర్తించి త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

మరో బియ్యం వ్యాపారిని అరెస్ట్..

నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంగా రేషన్‌బియ్యం రవాణాకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రెంటచింతల గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి తిప్పబత్తుల వెంకటనారాయణ అలియాస్ నారాయణ నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామానికి చెందిన రమావత్ కోటేశ్వర్‌రావు, రమావత్ ధనమూర్తిఓ కలిసి రేషన్‌బియ్యాన్ని అర్ధరాత్రి రాష్ట్ర సరిహద్దు దాటిస్తుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం బాల్నేపల్లి గ్రామశివారులో శిథిలావస్థలో ఉన్న ఓ ఇంట్లో నిల్వచేసిన సుమారు నాలుగు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టగా బియ్యాన్ని రమావత్ కోటేశ్వర్‌రావు, రమావత్ ధనమూర్తి సేకరించి డంప్ చేసినట్లు తేలిందన్నారు. వ్యాపారి వెంకటనారాయణ స్థానికంగా ఏర్పాటు చేసుకున్న ముఠాసభ్యులతో రేషన్‌బియ్యాన్ని సేకరించి ఏపీకి చెందిన అంగోతు రాంబాబు, పెంటబోయిన సైదారావుల సహకారంతో ఏపీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న బియ్యం వ్యాపారి వెంకటనారాయణను అడవిదేవులపల్లి వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిసారు. ఈ రెండు కేసుల్లో ప్రధాన నిందితులకు సహకరించిన వ్యక్తులను గతంలో అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు. రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏపీ రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రాధాన నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి, అడవిదేవులపల్లి ఎస్ఐలు హరికృష్ణ, శేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

కార్పొరేషన్లకు సభ్యుల నియామకం

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కార్పొరేషన్లకు సభ్యులను నియమించగా, ఉమ్మడి గుంటూరుకు చెందిన పలువురు స్థానం పంపాదించుకున్నారు. యాదవ కార్పొరేషన్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ నేత తాడిబోయిన భాస్కరరావు, గౌడ కార్పొరేషన్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి టీడీపీ నేత కందుల వెంకట రమణ, గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచచి లక్ష్మీశైలజ గౌడ్, మాల కార్పొరేషన్లో పొన్నూరు నియోజకవర్గం నుంచి టీడీపీ నేత బండ్లమూడి బాబూరావులు సభ్యులుగా నియమితులయ్యారు.

అభాగ్యులకు.. ఆసరా

- మిషన్ వాత్సల్యలో 318 మందికి లబ్ధి
- రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- దరఖాస్తులతో సరిపెట్టిన గత వైసీపీ పాలకులు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి) కరోనా మహమ్మారిలో తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మారిన వారు కొందరైతే, తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయి అభాగ్యులుగా మారిన వారు మరికొందరు. వీరే కాక రకరకాల కారణాలతో అనాథలుగా బతికేవారు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు ఇలాంటి వారందరినీ అక్కున చేర్చుకుని అండగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2022లో మిషన్ వాత్సల్య పథకానికి శ్రీకారం చుట్టాయి. అయితే కేంద్రం మిషన్ వాత్సల్య పథకానికి రూపకల్పన చేసినా వైసీపీ పాలకులు చిన్నారులకు సాయం అందించే బాధ్యతను మరిచారు. ప్రభుత్వ ప్రాథామ్యాలలో ఒకటిగా ఉండాల్సిన ఈ పథకాన్ని నీరుగార్చారు. మొక్కుబడిగా దరఖాస్తుల స్వీకరణతో సరిపెట్టిందే తప్ప పిల్లల బాగోగులు చూడడంలో పూర్తిగా విఫలమైంది. సంరక్షకుల నీడలో ఉండే చిన్నారులు ఆ డబ్బులు కోసం కళ్లు కాయాలు కాచేలా ఎదురుచూసినా, కార్యాలయాల చుట్టూ తిరిగినా గత పాలకులు మనసు కరగలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆయా దరఖాస్తులపై దృష్టి సారించింది. తొలివిడతలో జిల్లాలో మొత్తం 490 దరఖాస్తులు వచ్చినట్లు తేల్చారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా 318 మంది అంతిమంగా ఆ పథకానికి అర్హులుగా తేలారు. జాబితా కేంద్రానికి పంపడం, వెంటనే నిధులు మంజూరు చేయించింది. 318 మంది చిన్నారుల సంరక్షకుల ఖాతాల్లో 78 లక్షల నగదును ఈ ఏడాది సెప్టెంబరు 3నే జమ చేసినట్లు ఐసీడీఎస్ విభాగం తెలిపింది. ఇందులో అనాథలు 61 మంది ఉండగా, కొవిడ్ వల్ల అభాగ్యులుగా మిగిలినవారు 80 మంది, హెచ్ఐవీ ఎఫెక్టెడ్ 27, తల్లి లేదా తండ్రిలో ఒకరిని కోల్పోయిన చిన్నారులు 150 మందికి మిషన్ వాత్సల్య పథకం కింద నగదును జమ చేసింది.

ఆరు నెలలకు ఒకేసారి...

వాస్తవానికి మిషన్ వాత్సల్య పథకం తాలూక నగదు గతేడాది అక్టోబరులోనే లబ్ధిదారులకు అందాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ఇది పేపర్లకే పరిమితమైంది తప్ప అమలుకు నోచుకోలేదు. నెలకు రూ.4,000 చొప్పున గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు అంటే ఒకేసారి ఆరు నెలలకు సంబంధించి నగదును ఒకేసారి చిన్నారుల సంరక్షకుల ఖాతాల్లో జమ అవడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కూడా వేగవంతంగా జరుగుతుంది. ఇది 2024-25కు సంబంధించిన ప్రక్రియగా అధికారులు చెబుతున్నారు. నిధుల లభ్యత దృష్ట్యా కేవలం 25 మందికే ఈ దఫాలో అవకాశం కల్పించడానికి వీలుందని ఐసీడీఎస్ విభాగం చెబుతోంది. వీటికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు కూడా అక్టోబరు 25తో ముగిసింది. మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వీరిలో 25 మందిని ఎంపిక చేయడానికి కసరత్తు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు

పథకానికి అర్హతలివే

2025 మార్చి 31కి 18 ఏళ్ల వయసులోపునే ఉండాలి. తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న దంపతుల పిల్లలు, సదరు కుటుంబం వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించనివారై ఉండాలి. ఎవరైతే నిరాదరణకు గురవుతున్న పిల్లలున్నారో వారు తప్పనిసరిగా ప్రభుత్వ స్కూల్‌లోనే విద్యనభ్యసిస్తూ ఉండాలి.

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన



ఇప్పటికే ఖాతాల్లో నగదు జమైన లబ్ధిదారుల ఎంపికను కూడా పూర్తి పారదర్శకంగా నిర్వహించాం. జిల్లాలోని 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో రెండో విడతలో దరఖాస్తులు స్వీకరించాం. వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి తుది జాబితా ప్రకారం వారికి మిషన్ వాత్సల్య పథకం అందేలా చూస్తాం.

- కే.ఉమ, ఐసీడీఎస్ పీడీ



రథం లాగుతున్న గొట్టిపాటి హర్షవర్ధన్

ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుకు చేరిన మహాపాదయాత్ర

» పూజలు నిర్వహించిన హర్షవర్ధన్

అద్దంకి, సంతమాగులూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలం కుందుర్రు కు చెందిన అయ్యప్ప దీక్షాధారులు చేపట్టిన మహాపాదయాత్ర మంగళవారం కు ఆం ధ్ర,తమిళనాడు సరిహద్దులోని గుమ్మడిపూండి కి చే రింది. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు అయ్యప్ప మండల దీక్షలో ఉన్న హర్షవర్ధన్ మంగళవారం మహాపాదయాత్ర రథం వద్ద పూజలు నిర్వహించారు. దీక్షాధారులతో కలిసి మహాపాదయాత్రలో నడిచారు. పలువురు సంతమాగులూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు మంగళవారం తెలిపారు. డివిజన్ పరిధిలో 139 రెగ్యులర్ డీలర్ల ఖాళీలు ఏర్పడ్డాయి. కొత్తగా 4 షాపులు ఏర్పడ్డాయి. దీంతో మొత్తం 143 మంది డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తుదారులకు రాత, మౌఖిక పరీక్షల ద్వారా ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తారు. అభ్యర్థులు నిబంధనల మేరకు అర్హత ధ్రువపత్రాలతో ఈ నెల 28వ తేదీ లోపు చీరాల ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో సూచించారు.

పంట పొలాల్లో ఆడ శిశువు

సంతమాగులూరు, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి) : మానవత్వం మంటగలిసిపోతోంది. నవమోసాలు మోసి పుట్టబోయే బిడ్డ కోసం ఎన్నో కలలు గంటారు. ఆడబిడ్డ పుట్టిందని రోడ్డు పక్కన పొలాల్లో వదిలి వెళ్లిన ఘటన మండలంలోని పత్తేపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆడ బిడ్డకు జన్మనిచ్చి పంట పొలాల్లో వదిలి వెళ్లారు. పొలాల్లో పనులు కోసం వెళ్తున్న రైతులు చూసి పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సీడీపీవో సుధ చేరుకొని ఆడశిశువును ఒంగోలు శిశు సంరక్షణా కేంద్రానికి 108లో తరలించారు. సంతమాగులూరు మండలంలో ఇటీవల ఏల్చూరు గ్రామంలో ఆడశిశువును రోడ్డు వెంబడి వదిలి వెళ్లిన సంఘటన జరిగిన కొద్దిరోజులకే ఈ ఘటన చోటుచేసుకుంది.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

మేదరమెట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ, మినుము, జొన్న , మొక్కజొన్న పంటలను సాగు చేసుకోవాలని అద్దంకి డివిజన్ ఏడీఏ కె.ధనరాజ్ సూచించారు. మంగళవారం మండలంలోని అనమనమూరు గ్రామంలో వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఏడీఏ ధనరాజ్ రైతులతో మాట్లాడుతూ గత సంవత్సరం మంచి దిగుబడి మంచి ధరలు ఉన్నాయని ఈ సంవత్సరం ఎక్కువ మంది రైతులు మొగ్గు చేపుతున్నారు అని దాని వలన రైతులు ఇబ్బంది పడే అవకాశముందన్నారు. అధికంగా పొగాకు పండిస్తే మద్దతు ధర లేనప్పుడు ఎవరినీ అడగలేం, బతిమలాడలేం, నిలదీయలేమని కనుక పొగాకు తగ్గించి అపరాలు, చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలని ధనరాజ్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసరావు, ఏటీఎం రామిరెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకులు ఆఫ్రిన, రైతులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న వాహనం

మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు వైపు వెళుతున్న వాహనం రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ పోల్‌ను ఢీకొని అదేవేగంతో పక్కనున్న డివైడర్‌ను ఢీకొన్న సంఘటన మంగళవారం వేకువజామున జొన్నతాళి సెంటరు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఇద్దరు పురుషులు, ఐదుగురు మహిళలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అందిన సమాచారం మేరకు కృష్ణాజిల్లా నందిగామ సమీపంలోని బెల్లంకొండవారిపాలెంకు చెందిన జూపూడి జయకుమారి కుటుంబానికి చెందిన వారు చెన్నై వెళ్లి తిరిగి నందిగామ వెళుతుండగా, నిద్రమత్తులో వాహనడ్రైవరు విద్యుత్ పోల్‌ను ఢీకొనగా, వేగం అదుపుకాకపోవడంతో రోడ్డు దాటి ఒంగోలు వైపు డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా దెబ్బతినగా, అందులోని వ్యక్తులు క్షేమంగా బయటపడ్డారు. వారిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ప్రాథమిక చికిత్స చేసివారిని పంపించారు.

ప్రైవేటు బస్సు కింద పడి క్లీనర్‌కు గాయాలు

మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కింద క్లీనర్ పడడంతో అతని కాలు విరిగిన సంఘటన సోమవారం అర్ధరాత్రి బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద ఒంగోలు వైపు జరిగింది. ఈ ప్రమాదంలో రాజమండ్రికి చెందిన క్లీనర్ సీశాల ప్రసాద్‌కు కాలు విరిగింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు టోల్ ప్లాజా గేట్ గుండా వెళుతూ ఫాస్టాగ్ లేని కారణంగా మరో గేట్ గుండా వెళ్లేందుకు బస్సు వెనుకకు వస్తున్న సమయంలో బస్సులో గేట్ వద్ద నిలబడిన క్లీనరు బస్సు ముందు టైరు కింద పడిపోయాడు. దాంతో అతని కాలు విరిగింది. సమీపంలోని హైవే అంబులెన్సువారు అతనిని చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

షెడ్ వేసేద్దాం!



» పశువుల పాకలకు భారీ డిమాండ్
» కేటాయింపు కన్నా రెండున్నర రేట్లు అధికంగా దరఖాస్తులు
» 90శాతం రాయితీతో ఆసక్తిచూపుతున్న పశుపోషకులు
» జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన నిర్మాణాలు
» ఉపాధి హామీ నిధులు అనుసంధానం
» వేగంగా సాగుతున్న నిర్మాణాలు
» సంక్రాంతిలోగా పూర్తికి అధికారుల యత్నాలు

ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులకు కూటమి ప్రభుత్వం దన్నుగా నిలిచే క్రమంలో చేపట్టిన పశువుల పాకల నిర్మాణాల పథకానికి జిల్లాలో భారీ డిమాండ్ ఏర్పడింది. పెద్దసంఖ్యలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు తొలుత వచ్చిన వాటికి ప్రాధాన్యత ఇస్తూ మంజూరుచేయడంతో జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రస్తుతం పశువుల పాకల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పాడి పరిశ్రమకు ఊతం, గొర్రెలు, మేకల పెంపకం చేసే వారికి ఆసరాగా ఉండేందుకు ఎండలు, వర్షాల నుంచి వాటికి రక్షణ ఇచ్చేలా 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మినీ గోకులాలు పేరుతో షెడ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో అలా 2018లో 500 యూనిట్లు మంజూరుచేయగా 300 షెడ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అప్పట్లో కూడా వీటిని ఉపాధి హామీ పథకం అనుసంధాన నిధులతోనే ఇచ్చారు. అయితే పథకం ప్రవేశపెట్టిన కొద్దికాలానికి ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారగా ఆ లోపు కొంతమేర మాత్రమే లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు జరిగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకానికి మంగళం పాడటమే కాక చేసిన నిర్మాణాలకు కూడా బిల్లులు ఇవ్వక లబ్ధిదారులు నష్టపోయారు.

రాయితీ పెంపుతో ఆసక్తి

కాగా తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ పథకంపై దృష్టిసారించింది. ఈసారి యూనిట్ కాస్ట్‌ను పెంచడంతోపాటు రాయితీని కూడా పెంచింది. పశువుల పాకలకు యూనిట్ విలువ కనిష్ఠంగా రూ.1,03,500, గరిష్ఠంగా రూ.2,07,000లుగా నిర్ణయించింది. అందులో కేవలం పది శాతం మాత్రమే లబ్ధిదారుడు తన వాటాగా చెల్లిస్తే మిగిలిన 90శాతం ఉపాధి హామీ పథకం నుంచి ఇస్తారు. అలాగే గొర్రెలు, మేకల షెడ్లకు కనిష్ఠంగా రూ.1.30 లక్షలుగా నిర్ణయించగా అందులో లబ్ధిదారులు 30శాతం తమ వాటాగా చెల్లించాలి. పశుసంవర్ధకశాఖ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేస్తే ఉపాధి సిబ్బంది పర్యవేక్షణలో వాటిని నిర్మిస్తారు. జిల్లాలో పాడిపరిశ్రమ అధికంగా ఉన్న నేపథ్యంలో పలు ప్రాంతాల పశుపోషకులు ఈ పథకం వైపు మొగ్గుచూపి తమ వాటా నిధులు చెల్లించి దరఖాస్తు చేశారు.

షెడ్లకు నిర్మాణానికి ఆసక్తి

జిల్లాకు 1,075 యూనిట్లు మంజూరు కాగా దాదాపు 231 శాతంతో 2,486 దరఖాస్తులు అధికారులకు అందాయి. అందులో అత్యధికంగా దర్శి నియోజకవర్గం నుంచి ఏకంగా 383 శాతం వచ్చాయి. ఆ నియోజకవర్గానికి 125 యూనిట్లు కేటాయించగా 483 దరఖాస్తులు అందాయి. అలాగే వైపాలెం నియోజకవర్గంలో కేటాయించిన యూనిట్లతో పోల్చితే 281శాతం దరఖాస్తులు రాగా సంతనూతలపాడు నియోజకవర్గంలో 257 శాతం, కొండపి నియోజకవర్గంలో 255 శాతం మేర వచ్చాయి. ఇతర నియోజకవర్గాల్లో 200 శాతం లోపుగానే ఉన్నాయి.

నిర్మాణాలు ప్రారంభం

కాగా భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలకు ప్రాధాన్యత ఇస్తూ లబ్ధిదారుల ఎంపిక చేసినట్లు సమాచారం. అందులో సొంత స్థలాలలో నిర్మాణాలు చేసుకునే అవకాశం ఉన్న వారికి ముందుగా అనుమతులు మంజూరు చేసినట్లు తెలుస్తుండగా ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పశువుల పాకల నిర్మాణాలు ప్రారంభమై ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన వారికి వచ్చే ఏడాది కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎండ, వానలకు ఇబ్బంది తప్పింది

కూటమి ప్రభుత్వం పశువులకు గోకులాల పేరుతో షెడ్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. పశువుల సంరక్షణకు నాకు షెడ్డు మంజూరైంది. పశువులకు గతంలో పూరికొస్టం ఉండేది. పశువులను రోజూ పొలాల్లో మేపుకుని వచ్చాక ఆరుబయట కట్టేస్తాను. ఇపుడు గోకులం షెడ్డు నిర్మాణం పూర్తయ్యాక అవి నీడలో ఉంటాయి. ఎండ, వానలకు వాటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది.

- ఎం.శేషమ్మ, గోకులం లబ్ధిదారు, అనకర్లపూడి

వచ్చే ఏడాది కొనసాగుతుంది

పశువుల పాకల నిర్మాణాలు ప్రభుత్వ ప్రాధాన్య అంశం. ఈ ఏడాది జిల్లాకు 1,075 టార్గెట్ ఇచ్చారు. లబ్ధిదారుల ఎంపిక బాధ్యత పశుసంవర్ధకశాఖ అధికారులది. మాకు వచ్చిన ప్రతిపాదనల్లో 584 మంజూరు చేశాం. 380 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మిగతావి కూడా మంజూరు చేసి సంక్రాంతికి అన్ని పూర్తిచేస్తాం. డిమాండ్ అధికంగా ఉంది. వాటిని వచ్చే ఏడాది తీసుకుంటాం.

- జోసఫ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ డ్వామా

పశువులకు శాశ్వత నిర్మాణాలు

సొంతంగా అంత డబ్బులు పెట్టి షెడ్లు రైతులు వేసుకోలేరు. పూరికొస్టాలు, ఆరుబయట రోడ్ల వెంబడి కట్టేస్తాం. దీనివల్ల ఇబ్బందిపడుతున్నాం. ఆరు పశువులకు గోకులం షెడ్ నిర్మాణానికి రూ.2.30లక్షలు అవుతుండగా, అందులో పదిశాతం రూ.23వేలు మేము పెట్టుకుంటున్నాం. మిగతాది ప్రభుత్వం ఇస్తోంది. శాశ్వతంగా పశువులకు ఆవాసం ఏర్పడుతోంది. ఎండాకాలం, వర్షాకాలం పశువులు ఎండకు, నీడకు ఇబ్బందులు పడకుండా ఉంటాయి.

- కే.పద్మ, గోకులం లబ్ధిదారు, ముప్పరాజుపాలెం

- కొండపి నియోజకవర్గంలో భారీగా షెడ్లు మంజూరు చేయించుకున్నారు. అయితే ప్రభుత్వం, అధికారులు పొరపాట్లు, అవినీతికి అవకాశం ఇవ్వలేదు. కచ్చితంగా కొత్తగా నిర్మించుకునే వారికే అంటూ తేల్చిచెప్పింది. దీంతో చాలామంది వెనక్కి తగ్గారు. కొత్తవారికి, కచ్చితంగా నిర్మించుకునే వారికి ప్రభుత్వం షెడ్లను మంజూరు చేస్తోంది. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో కలిపి 135 వివిధ దశల్లో ఉన్నాయి. పది షెడ్లు నిర్మాణం పూర్తిచేసుకున్నాయి.
- క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి రైతులు, కాపరులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారు. కూటమి ప్రభుత్వం పశువుల పాకల పథకాన్ని ప్రకటించిన వెంటనే మంచి స్పందన వచ్చింది. జిల్లాకు కేటాయించిన యూనిట్ల కన్నా ఇంచుమించు రెండున్నర రేట్లు మేర దరఖాస్తులు అధికారులకు అందాయి. మొత్తం యూనిట్ విలువలో 90శాతం ప్రభుత్వం రాయితీ రూపంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధుల నుంచి ఇస్తుండటం అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అదేసమయంలో జిల్లాలోని అత్యధిక గ్రామాల్లో నాలుగైదు గేదెలు అలాగే 50 నుంచి 100 వరకు గొర్రెలు, మేకలు పెంపకం చేసుకునే మధ్యతరగతి వారు అధికంగా ఉండటం కూడా మరో కారణంగా కనిపిస్తోంది.

ఎమ్మెల్యే ఏలూరికి ప్రశంసలు

» అసెంబ్లీ వేదికగా అభినందనల వెల్లువ
» సోషల్ మీడియాలో లోకేష్, మంత్రుల శుభాకాంక్షలు

పర్చూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. మంగళవారం అసెంబ్లీ వేదికగా జనసేన పార్టీ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యే ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో అసెంబ్లీలోని సభ్యులంతా కరతాళధ్వనులతో ఎమ్మెల్యే ఏలూరికి ప్రశంసల జల్లు కురిపించారు. ఈసందర్భంగా ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేలందరూ ఏలూరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అటువంటి అవార్డును అందుకొని సభ గౌరవాన్ని పెంచారన్నారు. ఏలూరికి శాసనసభా పక్షం తరుపున శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియాలో మంత్రి నారా లోకేష్ ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మ, ఎంఎం కొండయ్య, అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, ఇంటూరి నాగేశ్వరరావు, బీఎన్ విజయ్ కుమార్, కందుల ఏలూరికి అభినందనలు తెలిపారు.



చెక్కును ఈవోకు అందజేస్తున్న సాంబశివరావు

శింగరకొండకు రూ.లక్ష విరాళం

అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి మార్టూరు మండలం చిమ్మిరిబండకు చెందిన తాళ్లూరి సాంబశివరావు మంగళవారం రూ.1,01,116 చెక్కును ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పావులూరి బాపయ్య, బాచిన స్వాములు, గు ర్రం శ్రీనివాసరావు,మలాది శ్రీనివాసరావు, గుళ్ళాపల్లి సు బ్రహ్మణ్యేశ్వరరావు, మాదాల సాంబశివ రావు, గోనుగుంట్ల రవికుమార్ పాల్గొన్నారు.

బధిరులకు అన్నదానం

అద్దంకిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అన్నదానం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది వజ్రాల అంజిరెడ్డి మనవరాలు సాయి ఇషిత పుట్టిన రోజు సందర్భంగా అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి మురళి సుధాకరరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, చిన్నిమురళీకృష్ణ, నరసింహరావు పాల్గొన్నారు.



సందీపికను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి తైక్వాండోకు ఎంపికైన రాజుబంగారుపాలెం విద్యార్థి

చినగంజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆట్ల సందీపిక జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగిన 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలలో 41 కేజీల విభాగంలో సత్తాచాటి సందీపిక గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఖాలీషావలి తెలిపారు. రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో ప్రతిభ చూపడంతో సందీపికను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. హర్యానా రాష్ట్రంలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో సందీపిక పాల్గొనన్నుట్లు తెలిపారు. సందీపిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన సభలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందీపికను హెచ్‌ఎం ఖాలీషావలి, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ పోతురాజు, ఎస్.అంకయ్య, బి.శ్రీనివాసరావు, పి.శ్రీలక్ష్మీ, జి.నాగమణి, తైక్వాండో కోచ్‌లు వాటుపల్లి సుబ్రహ్మణ్యం, షేక్ సుల్తాన్‌బాషా, విద్యార్థులు అభినందించారు.

జీజీహెచ్‌లో త్వరలో మదర్‌కేర్ సెంటర్

» ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్ అన్సారియా
» వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంపై హెడ్ నర్సుకు చార్జ్‌మెమో

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు బంగారు బాల్యాన్ని అందించేందుకు ఒంగోలులోని జీజీహెచ్‌లో కంగారు మదర్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారీయా పేర్కొన్నారు. మంగళవారం ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్ గైనిక్, చిన్నపిల్లల వార్డులతో పాటు పలు వార్డులలో పర్యటించి రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవలు, పారిశుధ్యం, తాగునీరు తదితర సమస్యలను గుర్తించిన కలెక్టర్ వాటిని వెంటనే పరిష్కరించాలని జీజీహెచ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ న్యూ బార్న్ మదర్ కేర్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే కనిగిరి సీహెచ్‌సీలో కేఎంసీ పైలట్ ప్రాజెక్టును చేపట్టేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పలు ప్రాంతాల్లో విస్తరించే ప్రణాళికలో భాగంగా ప్రస్తుతం జీజీహెచ్‌లోని గైనిక్, నవజాతి శిశు కేంద్రాలను పరిశీలించామన్నారు. కేఎంసీ అంటే తన బిడ్డకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహజ సిద్ధమైన సంచిలో దాచి ప్రాణాలు కాపాడే కంగారు మాదిరిగా ఉంటుందన్నారు. నెలలు నిండకుండా పుట్టిన, బరువు తక్కువగా పుట్టిన శిశువులకు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా చూడాలన్న ఆలోచనతోనే కంగారు మోడల్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా అప్పటి వరకు కడుపులో ఉండి ఈ లోకంలోకి వచ్చిన బిడ్డకు, తల్లికీ ఎప్పుడు కూడా పరస్పరం స్పర్శ ఉండేలాగా చూస్తారన్నారు. బిడ్డను తల్లి ఛాతీపైన సాధ్యమైనంత ఎక్కువ సమయం పడుకోపెట్టడం ద్వారా వెచ్చదనాన్ని, ప్రేమను పంచవచ్చన్నారు. సరైన విధానంలో పాలు పట్టడం, పోషణ, శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించడమే ఈ విధానం లక్ష్యమని కలెక్టర్ తెలిపారు., కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ పాల్గొన్నారు. వార్డుల్లో బాత్‌రూములు అధ్వానంగా ఉండటంతోపాటు, దుర్వాసన రావడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. బాధ్యతారాహిత్యంగా ఉన్న హెడ్ నర్సుకి చార్జ్ మెమో ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

(5వ పేజీ తరువాయి)

చూపిస్తుంది. జిన్నింగ్ మిల్లుల యజమానులు వినియోగిస్తున్న యంత్రాలకు, సీసీఐ బయ్యర్లు వినియోగిస్తున్న యంత్రాలకు తేడా కనిపిస్తుంది. సీసీఐ కేంద్రాల్లో ప్లాస్టిక్ గోతాల్లో పత్తి తీసుకువస్తే కొనుగోలు చేయడంలేదు. దీంతో రైతులు విడిగానే పత్తిని లోడ్ చేసి తీసుకువస్తున్నారు. మినీ ఆటోల్లో పత్తిని ఎక్కువ మొత్తంలో తొక్కడం వల్ల లోపల వేడి పెరిగి తేమ శాతం పెరిగిపోతుందని రైతులు చెబుతున్నారు. ఒకే లాట్‌లో ఐదు రకాలుగా తేమ శాతం నమోదవుతుంది.

రవాణా భారం తడిసి మోపెడు..

మద్దతు ధర వస్తుందన్న ఆశతో సీసీఐ కేంద్రాలకు రైతులు పత్తిని తరలిస్తున్నారు. అందుకు రవాణా భారం తడిసి మోపెడవుతోంది. అయితే అంత భారం భరించి తీసుకువచ్చిన తర్వాత తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొన్ని లాట్లు కొనుగోలుకు బయ్యర్లు సుముఖత చూపటం లేదు. దీంతో దానిని వెనక్కి తీసుకెళ్లడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ఉదాహరణకు గుంటూరు మండలం చౌడవరం నుంచి జూటూరి వెంకయ్య అనే రైతు ఐదో మైలు వద్ద ఉన్న జగ్గయ్యపేట కేంద్రానికి 15 క్వింటాళ్ల పత్తిని తీసుకువచ్చేందుకు రూ.2500 వ్యయమైంది. పత్తి లోడ్‌కు క్వింటాల్‌కు రూ.150 కింద ఖర్చు అయ్యింది. తెచ్చిన మొదటి రోజు కొనుగోలు చేయకపోవడంతో ఆటో వెయిటింగ్ చార్జి కింద రూ.1000 వరకు చెల్లించారు. అంత వ్యయం చెల్లించి ఒకరోజు అంతా నిరీక్షించినా తేమ శాతం అధికంగా ఉందని కొనుగోలు చేయలేదు. ఆ పత్తిని తిరిగి తీసుకువెళ్లడం రైతుకు తలకు మించిన భారమైంది. సీసీఐకి తీసుకువచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందంటున్న రైతులు ఎంతో కొంత తగ్గించి అయినా కొనుగోలు చేయాలని అధికారులను కోరుతున్నారు.

తేమ శాతం పెంచి కొనుగోలు చేయాలి



ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురిశాయి.ఇప్పుడు చలి కాలం వచ్చేసింది. గాలిలో తేమ శాతం పెరిగిపోయింది. ఇటువంటి పరిస్థితి లో పత్తి ఆరాటం చాలా కష్టం. సీసీఐ అధికారులు తేమ శాతం పెంచి పత్తి ని కొనుగోలు చేయాలి. లేకపోతే పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

- మలిపెద్ది లక్ష్మీ నారాయణ, కొర్రపాడు, మేడికొండూరు మండలం

ధర తగ్గించైనా కొనుగోలు చేయాలి



సీసీఐ కేంద్రానికి తెచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లడం తలకు మించిన భారం. ఒక వేళ తేమ శాతం ఎక్కువగా ఉంటే ధరలో ఎంతో కొంత కోత విధించి పత్తి కొనుగోలు చెయ్యాలి. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

- జుటూరి వెంకయ్య, చౌడవరం, గుంటూరు మండలం

విస్తారంగా పొగాకు సాగు

» దక్షిణాదిలో ఇప్పటికే 40వేల హెక్టార్లలో నాట్లు
» భారీగా పెరగనున్న విస్తీర్ణం
» పెరిగిన నారు ధర, కూలీల వేతన ఖర్చు
» అయినా ముమ్మరంగా సాగు
» గత రెండేళ్ల ధరల ప్రభావం, వాతావరణ అనుకూలతలే కారణం

ఒంగోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో పొగాకు పంట సాగు ఈ ఏడాది విస్తారంగా సాగుతోంది. పలు ప్రాంతాల్లో రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. పొగాకు సాగు చేసే ప్రాంతాల్లో ఏ గ్రామంలో చూసినా ఎదుగుదలలో ఉన్న పొగ మొక్కలు అలాగే కొత్తగా నాట్లు వేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి పొగాకు నారు ధర రెట్టింపునకు పైగా పెరిగినా, కూలీల ఖర్చు రెట్టింపు అయినా, అంతకు మించి కర్ణాటకలో ప్రస్తుత సీజన్ మార్కెట్ ప్రతికూలంగా సాగుతున్న ఇక్కడి రైతులు మాత్రం ముమ్మరంగానే పంట సాగు చేస్తున్నారు. ఇప్పటికే దక్షిణాదిలో దాదాపు 40వేల హెక్టార్లలో పొగాకు నాట్లు పూర్తికాగా మరో నెలన్నరకు పైగా సాగుకు అవకాశం ఉండటంతో మరో 40 నుంచి 50వేల హెక్టార్లలో నాట్లు వేసే పరిస్థితి కనిపిస్తున్నది.

అందరి చూపు పొగాకు వైపే

ఒంగోలు కేంద్రంగా ఉన్న దక్షిణాదిలోని రెండు రీజియన్ల పరిధిలో 11 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. ఈ పరిధిలో గత ఏడాది సుమారు 57,768 హెక్టార్లలో సాగుకు 89.98 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే రైతులు దాదాపు 72 వేల హెక్టార్లపైగా విస్తీర్ణంలో సాగుచేసి సుమారు 150 మిలియన్లు ఉత్పత్తి చేశారు. అలా భారీగా సాగు, ఉత్పత్తి పెరిగినా అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలించి ధరలు బాగానే లభించాయి. ఆ ప్రభావం ప్రస్తుత సీజన్‌పై తీవ్రంగా పడింది. విస్తారంగా పంట సాగుకు రైతులు ఉపక్రమించారు. రైతుల కోరిక మేరకు ఈ ఏడాది (2024-25) పొగాకు బోర్డు కూడా కొంతమేర అదనంగా సాగుకు, పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. దక్షిణాదిలో ప్రస్తుత ఏడాదికి సుమారు 67వేల హెక్టార్లలో పంట సాగుకు, 105 మిలియన్ కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా భారీగా పెరిగే పరిస్థితి కనిపిస్తోంది.



చెరుకూరపాడులో పొగ నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

అనుకూలంగా వాతావరణం

పశ్చిమ ప్రాంతంలోని తేలిక నేలల్లో సెప్టెంబరులోనే పొగాకు నాట్లు చేపట్టగా నల్లరేగడి నేలల్లో ప్రస్తుతం వేస్తున్నారు. గత ఏడాది భారీగా ధరలు లభించి రాబడి ఉండటంతో పాటు ఈ ఏడాది పొగాకు సాగుకు వాతావరణం బాగా అనుకూలించింది. దీంతో విస్తారంగా సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం చూస్తే పొదిలి వేలం కేంద్రం పరిధిలో 8వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో సాగు చేయగా, ఒంగోలు-1 పరిధిలో 4,600, వెల్లంపల్లి కేంద్రం పరిధిలో 4 వేలు, కొండపి కేంద్రం పరిధిలో నాలుగున్నర వేలు, టంగుటూరు వేలం కేంద్రం పరిధిలో 2వేలు, ఒంగోలు-2 కేంద్రం పరిధిలో 1,500 హెక్టార్లలో సాగు చేయగా, నెల్లూరు జిల్లాలోని కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి తదితర కేంద్రాలలో మరో 16వేల హెక్టార్లలో సాగు చేశారు. ఇంకా నెలన్నర నుంచి రెండు నెలల పాటు పొగాకు సాగుకు సమయం ఉంది.

రెండింతలైన ఖర్చులు

నల్లరేగడి ప్రాంతంలో ఇప్పుడిప్పుడే నాట్లు ప్రారంభమయ్యాయి. ఆ రకంగా చూస్తే మరో 40వేల హెక్టార్లపైగా విస్తీర్ణంలో నాట్లు పడే అవకాశం కనిపిస్తోంది. ఆ రకంగా భారీగా సాగు పెరగనుంది. ఇదిలాఉండగా సాగు ఆరంభం నుంచే రైతులపై భారం పడుతోంది. గతంలో ఎకరాకు మూటన్నర నారు అవసరం కాగా మూట రూ.1500 నుంచి రూ.2వేల ధర ఉండేది. ఈ ఏడాది మూట నారు ధర రూ.4వేలకు చేరగా నాణ్యత సరిలేక రెండు మూటలు వేయాల్సి వస్తోంది. అలాగే నాట్లు కూలీ కూడా గతంలో మనిషికి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.500కు చేరింది. ఇక ప్రస్తుతం కర్ణాటకలో ధరలు తగ్గి గందరగోళంగా ఉంది. అయినా ఇక్కడి రైతులు విస్తారంగా పంట సాగు చేస్తుండటం పట్ల పొగాకు రంగ అనుభవజ్ఞులు, బోర్డు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు నియంత్రించుకోవాలని సూచిస్తున్నారు.

రోడ్డు మార్జిన్‌లో గోతులు

- తరచూ ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



చందలూరు నుంచి ఇంకొల్లు వైపు వెళ్లే ఆర్అండ్‌బీ బీటీ రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గుంతలు

పంగులూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు నుంచి ఇంకొల్లు వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా మార్జిన్‌లు గోతులమయంగా మారాయి. రోడ్డు మార్జిన్లలో అడుగడుగునా ఏర్పడిన గుంతలతో వాహనచోదకులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొల్లు నుంచి అద్దంకి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పాటు 16వ నెంబరు జాతీయ రహదారికి చేరుకునే రోడ్డు కావడంతో నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సింగిల్ రోడ్డు కావడం, రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లలో భారీ గోతులు ఏర్పడడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. రాత్రివేళ ఎదురుగా వచ్చిన భారీ వాహనాల వెలుతురో మార్జిన్‌లలో గోతులను గుర్తించలేక ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. వర్షం పడిన సమయంలో మార్జిన్ల వద్ద ఉన్న గుంతల్లో నీరు నిండిపోవడంతో వాటిని గుర్తించలేక వాహనదారులు పడిపోతున్నారు. రైతులు తమ పంటపొలాలకు ఎరువులు తరలించాలన్నా, కూలీలను ట్రాక్టర్లు, ఆటోలలో తరలించాలన్నా ఈ గోతులతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇటుక, ఇసుకతో పాటు ఎరువులు ఇతర సరుకులు చేర్చే ట్రాక్టర్లు, లారీలు, ఆటోలతో పాటు ప్రయాణికులను, విద్యార్థులను తిప్పే ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో ప్రయాణం నరకమని ప్రజలు వాపోతున్నారు. అలవలపాడు అడ్డరోడ్డు నుంచి కొణికి వరకు బీటీ రోడ్డుకు ఇరు వైపులా మార్జిన్లలో ఏర్పడిన భారీ గోతులను తక్షణమే మరమ్మతులు చేసి, రోడ్డుకు సమాంతరంగా బరమ్ నింపి వాహన చోదకులకు తగిన రక్షణ కల్పించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డికి సన్మానం



నర్సిరెడ్డిని సన్మానిస్తున్న ఏలూరి కార్యాలయ ప్రతినిధులు

మార్టూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని ఘనంగా సన్మానించారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి ఆయన వచ్చారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరి సాంబశివరావు గెలుపునకు పర్చూరు నియోజకవర్గంలో నర్సిరెడ్డి ప్రచారం చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గ పార్టీ నాయకులతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. టీటీడీ బోర్డుమెంబర్‌గా నియమించిన తర్వాత ఆయన క్యాంపు కార్యాలయానికి రావడంతో కార్యాలయ ప్రతినిధులు నర్సిరెడ్డిని శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వెంకట్, అఖిల్ పాల్గొన్నారు.



రైతులకు మినుములను పంపిణీ చేస్తున్న అధికారులు

ఉచితంగా మినుము విత్తనాల పంపిణీ

వేటపాలెం(చీరాల), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో చల్లారెడ్డిపాలెం, అక్కాయిపాలెం గ్రామాల పరిధిలో సామూహిక ప్రదర్శనా క్షేత్రాలలో భాగంగా ఎంపిక చేసిన రైతులకు మినుము విత్తనాలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. చల్లారెడ్డిపాలెంలో 50 ఎకరాలకు ఎకరానికి 10కేజీల చొప్పున 50 మంది రైతులకు, అక్కాయిపాలెంలో 25 మంది రైతులకు మొత్తం 7.50 క్వింటాళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. సాగు మెళకువలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేట్ జి.రమేష్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు కె. రత్నకుమారి, ఏవో ఐ. కాశీ విశ్వనాథ్, ఏఈవోలు గోపికృష్ణ, జశ్వంత్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ చౌదరి

బల్లికురవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తుంటే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ జీవీ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలని చౌదరి అన్నారు. ప్రభుత్వ విద్య ఒత్తిడి లేని విద్య అని తెలిపారు. విద్యార్థులకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల నిండకుండా వివాహాలు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీపీతో విష వాయువులు విడుదల



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల దండుబాట రోడ్డులో నిర్మించనున్న ఎస్టీపీ (మురుగు నీటి శుద్ధి కేంద్రం)తో విషవాయువు విడుదలై ప్రజల ఆరోగ్యం క్షీణిస్తుందని సీపీఎం నాయకులు ఎన్.బాబూరావు అన్నారు. ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రాంతానికి సమీపంలో స్కూల్‌లో 5 వేల మంది చిన్నారులు చదువుతున్నారన్నారు. ప్లాంట్ చుట్టూ సుమారు 15వేల మంది దళితులు జీవిస్తున్నట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మునిసిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.జయరాజు, కాలనీ పెద్దలు కోండ్రు కిరణ్, పులిపాటి బాబూరావు, చంద్రబాబు, కృపావర్ధన్, శ్యాంప్రసాద్, నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి నివాళి

చినగంజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు మోహనలక్ష్మి నరసింహాచార్యులు, వాసవీ వనితా క్లబ్ మహిళల, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు, విద్యార్థినులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలను నిర్వహించారు. బీసీ బాలికల వసతి గృహంలోని బాలికలకు వాసవి సభ్యులు రాత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, రిటైర్డ్ ఆంధ్రాబ్యాంకు మేనేజర్ పర్వతరెడ్డి కాంతరావు, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ పోతురాజు, వాసవీ మండల అధ్యక్షురాలు కోట సుచిత్ర పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు

చీరాల సమస్యలపై అసెంబ్లీలో చర్చ

వాణి వినిపించిన ఎమ్మెల్యే కొండయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలలో రెండింటిపై మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రస్తావించారు. ప్రధానంగా చేనేతల సమస్యల పరిష్కారంలో భాగంగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చామని, అది ఎప్పటి నుంచి ప్రారంభించగలమో తెలపాలన్నారు. అత్యధికంగా నేతన్నలు ఉన్న ప్రాంతాల్లో చీరాల ఒకటన్నారు. ఈ ఏడాది జాతీయ చేనేత దినోత్సవాన్ని చీరాల నియోజకవర్గంలోనే అధికారికంగా జరిపిన విషయాన్ని మననం చేశారు. వైసీపీ పాలనలో నేతన్న నేస్తం పేరుతో కార్మికులను మోసం చేసిందన్నారు. 2014 నుంచి 2019 మధ్య ఏపీ పథకాలు అమలయ్యాయో వాటిని పునరుద్ధరించాలని నేతన్నలు కోరుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయపరంగా నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. అవి సక్రమంగా లేవు. వాటికి మరమ్మతులు అవసరం. యుద్ధప్రాతిపదికన ఆ చర్యలు చేపట్టేందుకు సహకరించాలి. ఏపీఎస్ ఐడీసీకి సంబంధించి రెండు జిల్లాల పరిధిలో కేవలం ఒక డీఈ, ఏఈ మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత ఉంది. ఈ క్రమంలో పని భారంతో డీఈ ఎప్పుడు ఫోన్ చేసినా ఆరోగ్యం సరిలేదని చెప్తున్నారు. యుద్ధప్రాతిపదికన చర్యలకు సంబంధిత మంత్రి సహకరించాలని సభ ద్వారా ఎమ్మెల్యే కొండయ్య కోరారు.

దివ్యాంగులు, ఎస్టీలకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చినగంజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు, ఎస్టీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జీ ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శుక్రవారం దివ్యాంగుల సమస్యలు, ప్రతి నెలా 4వ శుక్రవారం ఎస్టీల సమస్యల గురించి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రత్యేక ప్రజా సమస్యల కార్యక్రమానికి హాజరై సమస్యలపై తగు ఆధారాలతో అర్జీలు ఇవ్వాలని కోరారు. ప్రతి సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు సమస్యలను ముందుగా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని, పరిష్కారం కాని వాటిని ఎండార్స్‌మెంట్ ఇస్తామని తహసీల్దార్ తెలిపారు.

అద్దంకిటౌన్ : కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ప్రతి మూడవ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక మీకోసం జరుగుతుందని ఎంపీడీవో బత్తిని సింగయ్య తెలిపారు. దివ్యాంగులు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం పొందాలని సూచించారు. ప్రతి నాల్గవ శుక్రవారం షెడ్యూల్డ్ తెగల కోసం గ్రీవెన్స్ నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకుని వారి సమస్యలను సకాలంలో పరిష్కారించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

వ్యాసరచనలో మూడోస్థానం

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేసిన ఎస్పీ

మార్టూరు, నవంబరు 19 : పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ మంగళవారం మండల పోలీసుస్టేషన్‌లో సైబర్ క్రైమ్ అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పిసాయికీర్తి మూడవబహుమతి సాధించింది. మార్టూరులోని శ్రీశ్రీనివాస హైస్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థిని సాయికీర్తి మూడవ బహుమతిని సాధించడంతో ఉపాధ్యాయులు అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుషార్‌డూడీ ప్రశంసాపత్రం, నగదును సాయికీర్తికి అందజేశారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ



సోపిరాలలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏలూరికి అవార్డుపై హర్షం

చినగంజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు విజనరీ లీడర్ అవార్డు ప్రకటించడంతో టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోపిరాల గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మలపెంట జయరావు స్వగృహంలో మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన కేకు కట్ చేశారు. ప్రతి నిత్యం నియోజకవర్గ ప్రజల శ్రేయస్సును కాంక్షించే ఎమ్మెల్యే ఏలూరికి అంతర్జాతీయ పురస్కారం లభించడం అభినందనీయమని జయరావు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, కోట శివరామకృష్ణ, శిఖరం సూరిబాబు, షేక్ బాజీ, భయ్యా సతీష్, తుమ్మలపెంట శ్రీనివాసరావు, షేక్ నబీషా, మీర్జాన్, షేక్.సుభాని, గంటా నరసింహారావు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గోవాడ, చిన్నకొత్తపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు, మోదేపల్లి, మణికేశ్వరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వరి పండించిన రైతులు ప్రభుత్వం మద్దతు ధరకు అమ్ముకోవాలని తెలిపారు. గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2320, 75 కేజీల బస్తా రూ.1740 ధరగా పేర్కొన్నారు. గ్రేడ్ బీ రకం క్వింటా రూ.2300, 75 కేజీల బస్తా రూ.1725కి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గోనె సంచులు ప్రభుత్వం ఉచితంగా అందించడంతో పాటు రవాణ చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. తేమ శాతం 17లోపు కచ్చితంగా ఉండాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీ మా చేయించుకోవాలని, వరికి ఎకరాకు రూ.126, మొక్కజొన్నకు రూ.105, శనగకు రూ.84 చెల్లించాలని తెలిపారు. వరి పంటలో సుడి దోమ నివారణకు డినోటిఫ్యూరాన్ 20శాతం ఎస్‌జీ (టోకెన్) 75 గ్రాములు పిచికారీ చేయాలని, లేదా ట్రిష్లమేజోపైరం 10శాతం ఎస్‌సీ (ఫెగ్జాలాన్) 84 ఎంఎల్‌లో వేప నూనె కలిసి పిచికారీ చేయాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సాయిబాబు, పుట్టా సాంబశివరావు, మాకినేని ఏడుకొండలు, ధూళిపాళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

పంగులూరు : రైతులు పంట సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి అన్నారు. తూర్పు తక్కెళ్లపాడు, కొప్పెరపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. తక్కెళ్లపాడు గ్రామం లో సాగులో ఉన్న మిరపను రైతులతో కలసి పరిశీలించారు. మిరపలో నల్లి ప్రభావం ఉందని దాని నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పిచ్చిరెడ్డి, శింగరు, ఎనికపాటి శ్రీనివాసరావు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతిని అందజేస్తున్న గ్రంథపాలకుడు

విద్యార్థులకు బహుమతుల అందజేత

అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు హ్యాండ్‌రైటింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ గ్రంథపాలకుడు అవార్డు అందుకున్న సుగుణరావును సన్మానించారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, తాళ్ళూరు బాబురావు,రమేష్, జోషఫ్, గడ్డం సుబ్బారావు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

తాగునీటికి తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు రోడ్డులోని వాటర్ ట్యాంక్ మరమ్మతుల నేపథ్యంలో ప్రజలకు తాత్కాలిక అంతరాయం ఉన్నట్లు మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు 28 నుంచి 32 వార్డుల పరిధిలోని ఉజిలీపేట, హరిప్రసాద్ నగర్, జవహర్‌నగర్, మరియమ్మపేట, జయంతిపేట ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని చెప్పారు. మరమ్మతుల అనంతరం సేవలు యథావిధిగా కొనసాగుతాయని కమిషనర్ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

చీమలమందు తిని కాంట్రాక్టర్‌కు అస్వస్థత

- వంట రుచిగా లేదని రెండు సార్లు మెమోలు
- వేధిస్తున్నారంటూ బాధిత మహిళ ఆరోపణ

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకురాలితో అధికారులకు ఏర్పడిన వివాదం కారణంగా మంగళవారం ఉదయం స్కూల్ వంట గదిలో మహిళా కాంట్రాక్టర్ చీమలమందు తిని అస్వస్థకు గురైంది. సహచరులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాల్లో వెళితే.. సురేష్ మహల్ సమీపానికి చెందిన పుష్పలత 14 ఏళ్లుగా స్థానిక కేజీఎం హైస్కూల్లో ఎండీఎం ఏజెన్సీ తీసుకుని వంట చేస్తుం ది. కొంత కాలంగా వంట రుచికరంగా లేదంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌కు పుష్పలతకు మధ్య వివాదం నడుస్తుంది. ఈక్రమంలోనే ఎమ్ఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆదేశాల మేరకు రెండు సార్లు ఆమెకు నోటీసులు ఇచ్చినట్లు హెచ్ఎం చెప్పారు. తనను తొలగించాలనే దురుద్దేశంతోనే ఎంఈవో, హెచ్ఎం, మరో ఉపాధ్యాయుడు వేధిస్తున్నారని పుష్పలత ఆరోపిస్తున్నారు. ఈక్రమంలోనే మంగళవారం వంట గది వద్ద చీమల మందు తిన్నారు. ఆమెను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేయగా, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కమలాకర్ విషయంపై విచారణ చేస్తున్నారు.

బెల్టు షాపును నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు

బల్లికురవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో బెల్టు షాపును నిర్వహిస్తున్న ధర్మవరపు శ్రీనును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. మంగళవారం గ్రామ దర్శిని కార్యక్రమంలో భాగంగా ఉప్పుమాగులూరుకు ఎస్ఐ వెళ్లగా అక్కడ ధర్మవరపు శ్రీను బెల్టు షాపులో మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. శ్రీనును ఎక్సైజ్ పోలీసులకు అప్పగిస్తామని తెలిపారు.

పొలం వివాదంలో మహిళపై వ్యక్తి దాడి

చీరాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని గవినివారి పాలెంకు చెందిన మహాలక్ష్మికి సమీప బంధువులతో పొలం వివాదం ఉంది. ఈక్రమంలో ఆమెపై పెర్ల వెంకటరావు దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో యూనియన్ అద్దంకి డిపో కమిటీ ఆధ్వర్యంలో డీఏవీ సుబ్బారావు అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో మూడు నెలలుగా కార్మికులకు చెల్లించాల్సిన నైట్ అవుట్ అలవెన్స్‌లు, డేఅవుట్ అలవెన్సులు చెల్లింపులో యాజమాన్యం నిరక్ష్యం వహిస్తోందన్నారు. అధికారులకు అలవెన్సులు చెల్లిస్తున్నా కార్మికులకు చెల్లించడం లేదన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలన్నారు.కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఎస్‌కె టీటీజాన్, ఏసీహెచ్ అంజయ్య, బీసీహెచ్ శేఖర్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అద్దంకి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు బుధవారం సాయంత్రం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు 9959225697 సెల్ నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మోదేపల్లి,కొటికలపూడి ఫీడర్లలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి త్రీఫేజ్ సప్లై పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయడం జరిగిందని, అత్యవసర సమయం లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ ఇంట్లో చోరీ

దేవాంగపురి (చీరాలటౌన్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీ కార్యాలయం సమీపానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ పృథ్వీ నటరాజ్ కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. పది రోజుల కిందట హైదరాబాదులోని కుమారుడి వద్దకు వెళ్లారు. మంగళవారం చోరీ జరిగినట్లు పనిమనిషి ద్వారా తెలుసుకున్నారు.